REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

సంపుటి : 4 | సంచిక : 281 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 25-04-2025 | పేజీలు : 7



జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

## పాఠకులకు విజ్ఞప్తి

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

పాలనలో ఏఐ వినియోగించినా..

## మానవీయ కోణం ముఖ్యం : సీఎం చంద్రబాబు



**అమరావతి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై సచివాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైనా సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌నకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీశాఖ మాజీ సెక్రెటరీ చంద్రశేఖర్ సహా పలువురు నిపుణులు హాజరయ్యారు. గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై చర్చించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పౌర సేవల్లో టెక్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, ఫలితాలను పరిశీలించారు. ఏయే విభాగాల్లో ఎలాంటి సాంకేతికత వాడొచ్చు. ప్రస్తుత సమాచారం ఆధారంగా సేవలను ఎలా విస్తృత పరచవచ్చు అనే అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పాలనలో ఏఐ వినియోగించినా.. మానవీయ కోణం ముఖ్యమని సీఎం అన్నారు. టెక్నాలజీ వినియోగంతో రియల్‌టైమ్‌లో సేవలు అందిస్తామన్నారు. స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఇస్తూ త్వరలో 'డేటా లేక్' ఏర్పాటు చేస్తామన్నారు. భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఈ వర్క్‌షాప్ రెండు రోజుల పాటు జరగనుంది.

గత ప్రభుత్వం పంచాయతీ నిధులన్నీ

# నిర్వీర్యం చేసింది: పవన్ కల్యాణ్





**అమరావతి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** గ్రామ పంచాయతీల నిధులన్నీ గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విమర్శించారు. బిల్లులు రాకపోయినా పనులు చేసిన గుత్తేదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పవన్ పాల్గొని మాట్లాడారు. "పంచాయతీరాజ్ శాఖను ఇష్టంగా తీసుకున్నా. గ్రామాలు స్వయం ప్రతిపత్తి సంస్థలుగా ఎదగాలి. పల్లెల్లో ఉండటమంటే ఇష్టం.. కానీ కుదరలేదు. అధికారులు కృషితో గ్రామాల్లో వేగవంతమైన అభివృద్ధి సాగుతోంది. గతంలో చాలా తండాల్లో పర్యటించా.. అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. చిన్న పైరవీలు చేసినా చర్యలు తప్పవు" అని పవన్‌కల్యాణ్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి ఈ సందర్భంగా సంతాపం ప్రకటించారు.

**మధుసూదన్ రావుకు నివాళులర్పించిన పవన్ కల్యాణ్**

పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదన్ రావు మృతదేహానికి ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివాళులర్పించారు. నెల్లూరు జిల్లా కావలి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దని ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరిపారేయాలని అన్నారు. " ఏ మతధర్మం ఆచరిస్తారని అడిగిమరీ చంపారంటే ఎంతటి దారుణం. జమ్ముకశ్మీర్ అభివృద్ధిని తట్టుకోలేకే ఇంతటి కిరాతకానికి ఒడిగట్టారు. ఘాటింగ్‌ల కోసం చాలాసార్లు కశ్మీర్ వెళ్లా.. అక్కడి పరిస్థితి తెలుసు" అని తెలిపారు. అంతకు ముందు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కావలి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఏపీలో కొత్త పెన్షన్లకు

# సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్



**అమరావతి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ నెలకు రూ.4 వేలు చేసిన సంగతి తెలిసిందే. దివ్యాంగులకు సైతం నెల రూ.6 వేలు ఇస్తోంది. ఒకటో తేదీ ఉదయాన్నే ప్రభుత్వ అధికారులు ఏకంగా ఇంటికొచ్చి మరీ పెన్షన్ అందజేస్తున్నారు. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వం కొత్త పెన్షన్లకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు లక్ష కొత్త పెన్షన్లకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. భర్తను కోల్పోయిన వితంతువులను ఆదుకోవడం కోసం 89,788 కొత్త వితంతు పెన్షన్లకు ఆమోదం తెలిపారు. మే నెల మొదటి తారీఖు నుండి వీరందరికీ పెన్షన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కొత్తగా ధరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్‌ను జూన్ నుండి అందజేస్తారు. కాగా, 2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పెన్షన్ నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏ రోజైన సరే పెన్షను దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. అధికారులు వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు పెన్షన్ జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పెన్షన్ పొందే అవకాశం ఉండేది. కానీ, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి చెక్ పెట్టింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితాను రూపొందించే విధానం తీసుకొచ్చింది. ప్రతి ఏడాది జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని తేల్చి చెప్పింది. అయితే, గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆ ప్రకారంగా జాబితాను రూపొందించిన దాఖలాలు లేవు. విద్యుత్, ఇన్‌కమ్ టాక్స్, ఫోర్ వీలర్, ఇళ్లు, పొలం తదితరాల పేరుతో వేలాదిమందిని పెన్షన్ పథకానికి అనర్హులను చేసి జగన్ ప్రభుత్వం తొలగించింది. అయితే, ఇలాంటి వారంతా కూటమి ప్రభుత్వంలో ఉపశమనం పొందుతున్నారు.

పహల్గాం ఉగ్రదాడి..

## తిరుమలలో ఆక్టోపస్ బలగాల మాక్ డ్రిల్




**తిరుమల, ఏప్రిల్ 24 (జనస్వరం) :** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఉగ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉందని కేంద్ర నిఘావర్గాల హెచ్చరికలతో పటిష్ఠ చర్యలు చేపట్టారు. తిరుమలకు వచ్చే భక్తుల భద్రత దృష్ట్యా మాక్ డ్రిల్ నిర్వహించారు. పోలీసు, విజిలెన్స్, ఆక్టోపస్ బలగాలు ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నాయి. మరోవైపు లిపిరి తనిఖీ కేంద్రంతో పాటు ఘాట్ రోడ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలను భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా సోదాలు చేస్తున్నారు. శ్రీవారి ఆలయ పరిసరాల్లోనూ ప్రత్యేక భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు.

## ఒక అడుగు ముందుకు, వ్యాధి నిర్మూలన వైపు

2లో..

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 25 ఏప్రిల్ 2025,
తిథి : శుద్ధ ద్వాదశి (ఉ.11:49వ.కు),
నక్షత్రం : పూ/భాద్ర (ఉ.08:56వ.కు)
బ్రహ్మ ముహూర్తం : తె.04:22ల తె.05:10
రాహుకాలం : ఉ.10:40ల మ.12:15,
యమగండం : మ.03:23ల సా.04:57,
వర్జ్యకాలం : సా.05:37ల రా.07:14,

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 25 ఏప్రిల్ 2025,
ఫజర్ : తెల్లవారుజామున గం. 04:46
సూర్యోదయం : ఉదయం గం. 05:59
జొహర్ : మధ్యాహ్నం గం. 12:18
అసర్ : సాయంత్రం గం. 03:26
మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:36
ఇష : రాత్రి గం. 07:50




జన స్వరం

విలేకరులు కావలెను

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను.. అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# నీళ్ల నుంచి వ్యాపారం వరకు..


**- భారత్ నిర్ణయంతో పాక్‌కు చుక్కలే..**

**- ఎలాంటి ఎఫెక్ట్ ఉంటుందంటే?**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం దిల్లీలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాక్ పౌరులు, పర్యటకులు ఎవరైనా ఇండియాలో ఉంటే వారం రోజుల్లో వారి దేశానికి వెళ్లాలని అట్టారి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్‌ను వెంటనే నిలిపివేస్తున్నట్లుగా కేంద్రం తెలిపింది. పాక్ పౌరులును ఇండియాలోకి అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఇండస్ వాటర్ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు తెలిపింది. SAARC వీసా మినహాయింపు పథకం (SVES) వీసాల కింద పాకిస్తానీ పౌరులు భారత్‌లో ప్రయాణించడానికి అనుమతించబడరు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న వారు కూడా 48 గంటల్లో తమ దేశానికి వెళ్ళిపోవాలి. అలాగే సింధు జాలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. గతంలోనే ప్రధాని మోదీ రక్తం, నీరు కలిపి ఒకచోట ప్రవహించలేదన్నారు. కానీ ఇప్పటివరకు పాక్‌ను ఇబ్బంది పెట్టకూడదనే ఆలోచనతో సింధుజలాల జోలికి వెళ్ళలేదు. తాజాగా పాక్‌తో దౌత్య సంబంధాలతో పాటూ 64 ఏళ్ళ సింధు జలాల ఒప్పందాన్ని కూడా రద్దు చేసుకుంది భారత్. ఈ ఐదు నిర్ణయాలు పాకిస్థాన్‌పై తీవ్ర ప్రభావం చూపించనున్నాయి. నీళ్ళ నుంచి వ్యాపారం వరకూ పాకిస్థాన్‌కు చుక్కలు చూపించనుంది భారత్.

**సింధుజలాల ఒప్పందం.. :**

ఇది పాక్ చాలా పెద్ద షాక్. ఇండస్ రివర్ వాటర్ ఆగిపోతే పాకిస్తాన్ ఎడారిగా మారుతుంది అనడంతో ఎటువంటి సందేహం లేదు. ప్రపంచంలో అతి తక్కువ నీటి వనరులు ఉన్న దేశాల్లో పాకిస్తాన్ ఒకటి. దీనికి ప్రధాన ఆయువు ఇండస్ రివర్ వాటర్ ఒక్కటే. మొత్తం దేశ వ్యవసాయం సింధూ జలాలపైనే ఆధారపడి ఉంటుంది. అక్కడి పంజాబ్, సింధ్ వంటి రాష్ట్రాలకు ఇదే ప్రధాన వనరు. బలూచిస్తాన్, ఖైబర్ ఫఖ్తుంఖ్వా, సింధ్ ప్రాంతాలు అతి తక్కువ నీటి వనరులు కలిగిన ప్రాంతాలుగా ఉన్నాయి. ఇప్పుడు



భారత్ ఈ నీటిని ఆపేస్తే ఈ ప్రాంతాలన్నీ ఎడారిగా మారతాయి. ఇప్పటికే విపరీతమైన ద్రవ్యోల్బణం, పేదరికాన్ని ఎదుర్కొంటున్న పాకిస్తాన్ ఈ దెబ్బకు మలమల మాడిపోవడం ఖాయం. దీంతో అక్కడ తాగునీటికి, విద్యుత్‌కు కూడా కొరత ఏర్పడుతుంది. దీంతో ఇప్పటికే ఆర్థికంగా చితికిపోయిన పాకిస్థాన్ పరిస్థితి మరింత దిగజారిపోతుంది.

**వ్యాపార నష్టం.. :**

భారత్ తీసుకున్న నిర్ణయాల్లో అట్టారీ చెక్ పోస్ట్ ఒకటి. దీన్ని మూసివేయడం వలన రెండు దేశాల మధ్యనా రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. దీనివలన భారత్ నుంచి ఇప్పటివరకు తరలి వెళుతున్న వస్తువుల రవాణా ఆగిపోతుంది. దీంతో అక్కడి వ్యాపారులకు ఆర్థిక నష్టం వాటిల్లుతుంది.

## ఎడిటోరియల్

ఎప్పటి నుంచో రెండు దేశాల మధ్యనా ద్వైపాక్షిక వాణిజ్యం మూసివేయబడింది. దానికి తోడు ఇప్పుడు చిన్న చిన్న వస్తువుల మార్పిడి కూడా లేకపోతే పాకిస్తాన్ పరిస్థితి మరింత దారుణంగా తయారవనుంది.

**వీసా సేవలు.. :**

పాకిస్థానీయులకు వీసాలను కూడా భారతదేశం నిషేధించింది. దీని వలన ఆ దేశం నుంచి పూర్తిగా రాకపోకలు ఆగిపోతాయి. రెండు దేశాలు విడిపోయి చాలా కాలం అయినప్పటికీ పాకిస్తానీయులకు భారత్ లో బంధువులు ఉన్నారు. వారిని కలవడానికి ఇప్పటివరకు రాకపోకలు జరుగుతుండేది. కానీ ఇప్పుడు అది సాధ్యం కాదు. దీంతో బంధువులమంటూ వచ్చే ఉగ్రవాదులు, శత్రువులను పూర్తిగా కట్టడి చేసినట్లువుతుంది.

**హై కమీషన్ చర్య.. :**

న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్లో నియమించబడిన సలహాదారులను దేశం విడిచి వెళ్ళిపోమని చెప్పారు. ఆ దేశం నుంచి భారత సలహాదారుడిని కూడి వెనక్కు రప్పిస్తున్నారు. ఈ చర్య రెండు దేశాల మధ్య సైనిక స్థాయి చర్చలు మరియు సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తుంది. అదే సమయంలో, సిబ్బందిని తగ్గించడం పాకిస్తాన్ దౌత్యానికి దెబ్బ అవుతుంది.



**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**

## భూ సమస్యలపై వెల్లువెత్తిన ప్రజా వినతులు

**మంత్రి సవిత, ప్రభుత్వ సలహాదారు ఎం.ఏ. షరీఫ్‌కు వినతులు అందజేసిన ప్రజలు**



**మంగళగిరి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాలు, అధికారుల అలసత్వంపై ప్రజలు పెద్దఎత్తున ఫిర్యాదులతో ముందుకు వచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌లకు ప్రజలు తమ గోడును వెల్లడి చేశారు.

– అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లె మండలానికి చెందిన వై.రామచంద్ర తమకు చెందిన భూములను తహశీల్దార్ బి.మహేశ్వర్ రెడ్డి వైసీపీ నాయకుల పేరపై అక్రమంగా ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో మంత్రి సవితను ఆశ్రయించారు.

– ఏలూరుకు చెందిన పి.పెద్దింట్లు తన ఇంటి స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా, దాడి చేసి మెడలోని మూడు కాసుల బంగారు సూత్రం, నాన్ తాడు, ఇంటి పట్టాను లాక్కెళ్లారని ఫిర్యాదు చేశారు. మోటూరి రమణమ్మ, మోటూరి రంగబాబులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

– ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన మేడికొండ పున్నమ్మ తమ పొలంపై మ.రామస్వామి, మ.రవికుమార్ అక్రమ హక్కు చూపుతూ దాడికి దిగుతున్నారని పేర్కొన్నారు. కోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ అధికారుల వద్ద న్యాయం లేదన్నారు.

– నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలోని నేలటూరు గ్రామానికి చెందిన కె. వెంకటరత్నం, హైకోర్టు ఆదేశాలు వచ్చినప్పటికీ భూ సర్వే, హద్దుల నిర్ణయం జరగకపోవడంతో తమ భూమిని ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

– నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన దూదేకుల సిద్దయ్య, పల్లె పండుగ కింద రూ. 20 లక్షల విలువైన సీసీ రోడ్ల పనులు చేసిన బిల్లులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

– అనంతపురం జిల్లా శింగనమల మండలంలోని ఆకులేడు గ్రామానికి చెందిన సి. చిన్నఓబులేసు, ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని మల్లెల సూరి అనే వ్యక్తి ఆక్రమించేందుకు యత్నిస్తున్నాడని ఫిర్యాదు చేశారు.

– చుండు సుధీర్ అనే వ్యక్తి అన్నమయ్య జిల్లా రాజంపేట మండలానికి చెందినవారు. ఆకేపాటి సోదరులు తమ భూమిని ఆక్రమించారని, ప్రభుత్వం దానిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

– అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరం మండల కేంద్రానికి చెందిన రాజు, గ్రామంలోని శ్రీ నూకాంభికా అమ్మవారి దేవస్థానం, శివాలయంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి ఈఓను నియమించాలని, నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

– పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన పాలకొలను నవీన్, వైసీపీ ప్రభుత్వ హయాంలో సబ్ రిజిస్ట్రార్ వీరభద్రరావు తమ ఆస్తిని తప్పుడు నెంబర్లతో అక్రమంగా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు.

మంత్రి సవిత, ప్రభుత్వ సలహాదారు ఎం.ఏ. షరీఫ్ ప్రజల వినతులను గమనించి, సంబంధిత అధికారులను చర్యలు తీసుకునేలా ఆదేశించినట్టు తెలిపారు.

## ఒకేసారి తండ్రి, కూతురు టెన్త్ పాస్



**పులివెందుల ఏప్రిల్ 24 (జనస్వరం) :** రాష్ట్వ్యాప్తంగా బుధవారం విడుదలైన 2025 పది పరీక్షా ఫలితాల్లో తండ్రి, కూతురు ఒకేసారి ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి కడప జిల్లా గాలివీడు మండలం ఆవుల శెట్టివారిపల్లెకు చెందిన మోడెం వెంకటేశ్ 268 మార్కులు తెచ్చుకున్నారు. ఈయన 9వ తంగతి వరకు చదవి డ్రాప్ అయ్యారు. ఈ ఏడాది ఓ ప్రైవేట్ కళాశాలలో చదువి పాస్ అయ్యారు. ఆయన కుమార్తె మోడెం పూజిత ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివి 585 మార్కులు సాధించింది.

## ఒక అడుగు ముందుకు, వ్యాధి నిర్మూలన వైపు

**నేడు వరల్డ్ మలేరియా డే**

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న, ప్రపంచం ఒక కీలకమైన ఆరోగ్య సమస్యపై దృష్టి సారిస్తుంది – వరల్డ్ మలేరియా డే. ఈ రోజు మలేరియా వ్యాధి గురించి అవగాహన కల్పించడానికి, దాని నివారణకు కృషి చేయడానికి మరియు దీనిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో జరుపబడుతుంది. 2025లో "మలేరియా నిర్మూలనకు సమన్వయ కృషి" అనే థీమ్‌తో ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను, సంస్థలను ప్రభుత్వాలను ఒకే లక్ష్యం కోసం ఏకం చేస్తుంది.

**మలేరియా : ఒక ప్రపంచ సవాలు**


మలేరియా అనేది ప్లాస్మోడియం పరాన్నజీవి వల్ల సంక్రమించే వ్యాధి, ఇది అనాఫిలిస్ దోమల ద్వారా వ్యాపిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) గణాంకాల ప్రకారం, 2023లో సుమారు 249 మిలియన్ మలేరియా కేసులు నమోదయ్యాయి. 608,000 మంది ఈ వ్యాధి వల్ల మరణించారు. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాలోని అనేక దేశాలు ఈ వ్యాధి బారిన పడుతున్నాయి, ముఖ్యంగా పిల్లలు, గర్భిణీ స్త్రీలు అత్యంత ప్రమాదంలో ఉన్నారు.

**వరల్డ్ మలేరియా డే ప్రాముఖ్యత :**

2007లో వరల్డ్ హెల్త్ అసెంబ్లీ ఏప్రిల్ 25న వరల్డ్ మలేరియా డేను గుర్తించాలని నిర్ణయించింది, ఇది గతంలో ఆఫ్రికా మలేరియా డే (2001 నుండి)గా నిర్వహించేవారు. ఈ రోజు కేవలం ఒక వేడుక కాదు, ఇది ఒక ఉద్యమం – ప్రపంచవ్యాప్తంగా మలేరియాతో పోరాడేందుకు కొత్త వ్యూహాలను రూపొందించడానికి, నిధులను సమీకరించడానికి, సమాజంలో అవగాహనను పెంచడానికి 2025లో, ఈ రోజు సాంకేతిక ఆవిష్కరణలు, వ్యాక్సిన్ అభివృద్ధి, స్థానిక సమాజాల సహకారంతో మలేరియా నిర్మూలనకు కృషి చేయడంపై దృష్టి పెడుతుంది. ఆర్టీఎస్, ఎస్, ఆర్ 21 వంటి వ్యాక్సిన్‌లు ఇప్పటికే ఆఫ్రికాలోని అనేక దేశాలలో విజయవంతంగా పరీక్షించబడ్డాయి, ఈ రోజు వాటి విస్తరణకు మరింత ఊతమిస్తుంది.

**2025 థీమ్ : సమన్వయ కృషి**

ఈ సంవత్సరం థీమ్, "మలేరియా నిర్మూలనకు సమన్వయ కృషి," సమష్టి బాధ్యతను హైలైట్ చేస్తుంది. ఇది కేవలం వైద్యులు లేదా శాస్త్రవేత్తల బాధ్యత కాదుబీ ప్రతి వ్యక్తి, సంస్థ, ప్రభుత్వం ఈ




పోరాటంలో భాగం కావాలి. ఈ థీమ్ క్రింది అంశాలపై దృష్టి పెడుతుంది.

**సాంకేతిక ఆవిష్కరణలు :** జన్యు సవరణ దోమలు, ఏఐ ఆధారిత వ్యాధి నిర్ధారణ, డ్రోన్ ఆధారిత ఔషధ పంపిణీ.

**సమాజ సహకారం :** స్థానిక సమాజాలలో అవగాహన కార్యక్రమాలు, దోమతెట్ల పంపిణీ.

**ప్రభుత్వ మద్దతు :** ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం, నిధుల సమీకరణ.

**మనం ఏమి చేయొచ్చు? :**

వరల్డ్ మలేరియా డే 2025లో, ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయవచ్చు

**అవగాహన కల్పించండి :** సోషల్ మీడియాలో #WorldMalaria Day హ్యాష్ ట్యాగ్‌ని ఉపయోగించి మలేరియా గురించి సమాచారం పంచుకోండి.

**దోమతెట్లను ఉపయోగించండి :** మలేరియా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇన్సెక్టిసైడ్ – ట్రీటెడ్ దోమతెట్లను ఉపయోగించండి.

**విరాళాలు ఇవ్వండి :** WHO, UNICEF, లేదా ఇతర ఎన్జీఓలకు విరాళాలు ఇచ్చి మలేరియా నిర్మూలన కార్యక్రమాలకు మద్దతు ఇవ్వండి.

**స్థానిక కార్యక్రమాల్లో పాల్గొనండి :** మీ ప్రాంతంలో జరిగే అవగాహన కార్యక్రమాలు లేదా ఆరోగ్య శిబిరాలలో చేరండి.


**ముగింపు :**

వరల్డ్ మలేరియా డే 2025 అనేది కేవలం ఒక రోజు కాదు.. ఇది ఒక ఆశాకిరణం, ఒక సమష్టి లక్ష్యం. మనం అందరం కలిసి, సాంకేతికత, సమాజం, సమన్వయ కృషితో మలేరియా లేని ప్రపంచాన్ని సృష్టించగలం. ఈ ఏప్రిల్ 25న, ఒక అడుగు ముందుకు వేద్దాం – మలేరియా నిర్మూలన వైపు!

**– నిర్మలా జ్యోతి**

## అర్జీదారులకు సత్వర పరిష్కారం చూపాలి

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**పులివెందుల, ఏప్రిల్ 24 (జనస్వరం) :** అధికారులు అర్జీదారులకు సత్వర పరిష్కారం చూపి వారికి న్యాయం చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారంఉమ్మడి కడప జిల్లా చిన్నమండెం మండలం, బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమాలకు వస్తుంటారని ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అధికారులు అప్పటికప్పుడే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. గతంలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏ ఒక్కరూ సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజా సమస్యలకు మొదటి ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించడం జరుగుతుందన్నారు. అధికారులు ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి ప్రజల అర్జీలను స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు

## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

**గుడివాడ జనసేన ఆధ్వర్యంలో రెండో రోజు నిరసన దీక్ష**



**గుడివాడ, ఏప్రిల్ 24 (జనస్వరం) :** జమ్మూ కశ్మీర్‌లో మంగళవారం చోటు చేసుకున్న ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తూ, జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండో రోజు బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద నిరసన దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు గుడివాడ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ నేతత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఉగ్రదాడిలో అమాయకుల ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమైన ఘటన. దాడికి పాల్పడిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వేమూరి త్రినాథ్, ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్, ఐటీ కోఆర్డినేటర్ చింత రామకృష్ణ, గుండు వెంకట్రావు, సుంకర వెంకట, షరీఫ్, సాయన నాని, గునుకుల వినోద్, నీల సాయి కృష్ణ, పురుషోత్తం, నందివాడ మండల నాయకులు బెజ్జవరపు విష్ణు ప్రసాద్, సాన ప్రసాద్, మోటూరు మండల జనసేన నాయకులు సనకాయల జనార్దనరావు పాల్గొన్నారు. అలాగే వీరమహిళలు సౌమ్య, భవాని, దుర్గా, తెలుగు మహిళ నాయకురాలు వీరమాచినేని శైలజ చౌదరి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# జమ్మూ కాశ్మీర్‌లో అమాయక పర్యాటకులపై ఉగ్రదాడులు అమానుషం

- ఉగ్రవాదుల చర్యలను సమైక్యంగా ఎదుర్కోవాలి
- ఏలూరులో జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన
- పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన మృతుల ఆత్మకు శాంతి నివాళి




**ఏలూరు, ఏప్రిల్ 24 (జనస్వరం) :** భారత అంతర్భాగం కాశ్మీర్లో భయానక వాతావరణం సృష్టించేందుకే ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు అన్నారు. జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఏలూరులో గురువారం సాయంత్రం "జనసేన కన్నీటి నివాళి" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జనసేన కార్యాలయం వద్ద నుంచి 12 పంపుల సెంటర్, చేపలు తూము సెంటర్ మీదుగా బోసు శిబిరం వరకు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ అనంతరం కూడలిలో ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రదాడి మృతుల ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ భూతల స్వర్గంలా భాసిల్లే కాశ్మీరు అందాలు తిలకించేందుకు వచ్చిన పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి దుర్మార్గ చర్య అన్నారు. జమ్మూ కాశ్మీర్లో భారత ప్రధాని నరేంద్రమోడీ కృషితో కొంతకాలంగా శాంతి నెలకొన్న నేపథ్యంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించేందుకే ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాశ్మీర్లో మళ్ళీ పూర్వపు భయాందోళన వాతావరణం కల్పించేందుకు ఉగ్రవాదులు చేసే ప్రయత్నాలను భారతీయులందరూ కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా సమైక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.. జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దేశం పట్ల అంకితభావంతో, ప్రజలను జాగ్రత్తపరిచి, చైతన్య పరిచేందుకు, దేశం కోసం సమిష్టిగా కదిలించేందుకు మూడు రోజులపాటు సంతాప దినాలు ప్రకటించారని తెలిపారు. కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, మన కాశ్మీరులో ఉగ్రవాదుల చర్యతో నెలకొన్న భయానక వాతావరణం వైదొలగి, శాంతి స్థాపన జరిగే వరకు ప్రతి భారతీయుడు దేశానికి మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. కాశ్మీరులో ఉగ్రదాడి దోషులను కఠినంగా శిక్షించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. శాంతియుత భావంతో అన్ని వర్గాల ప్రజలు, కలిసిమెలిసి జీవిస్తున్న భారతదేశం ఇతర దేశాలకు ఆదర్శనీయమన్నారు. అలాంటి దేశంలో ఉగ్రవాదుల చర్యలు దారుణమన్నారు. ఆయన ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. హిందూ పర్యాటకులపై దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత కార్యదర్శి దోనేపూడి లోవరాజు, జిల్లా కార్యదర్శి కస్తూరి తేజస్విని, జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ గుప్తా, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, 44 వ డివిజన్ కార్పోరేటర్ పొలిమేర దాసు, నగర ప్రధాన కార్యదర్శులు సరిది రాజేష్, కావూరి వాణిశ్రీ, పల్లి విజయ్, కార్యదర్శులు ఎట్రించి ధర్మేంద్ర, బొత్స మధు, కందుకూరి ఈశ్వరరావు, మీడియా ఇంచార్జ్ జనసేన రవి, నాయకులు రెడ్డి గౌరీ శంకర్, వీరంకి పండు, దోసపర్తి రాజు నాయుడు, బోండా రాము నాయుడు, జనపరెడ్డి తేజ ప్రవీణ్, వాసు, నూకల సాయి ప్రసాద్,బుద్ధా నాగేశ్వరరావు, చిత్తిరి శివ,కోలా శివ, ఇద్దుం చిరంజీవి, కర్ర తవిటి రాజు, వేముల బాలు, కొనికి మహేష్, వాసా సాయి, వీర మహిళలు తాబేలు హిమబిందు, గిడుతూరి పద్మ, గుదే నాగమణి, వెలగా గాయత్రి, కొసనం ప్రమీల, యడ్లపల్లి మమతా, తుమ్మపాల ఉమా దుర్గ, దుర్గా బీబీ మరియు పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేది ఉపాధ్యాయుడే

- నైతిక విలువలు నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే
- జిల్లా విద్యాశాఖ అధికారి పి.జనార్దన్ రెడ్డి



**నంద్యాల, ఏప్రిల్ 24 (జనస్వరం) :** సమాజంలో గురువుకు ఉన్న ప్రత్యేకత ఎంతో ప్రధానమైందని, తల్లి తండ్రి గురు దైవం అన్న అంశాలకు నిదర్శనంగా ఉపాధ్యాయ వృత్తి కొనసాగించి విద్యార్థులలో ఆత్మస్థైర్యం నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి పి. జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కరిమద్దెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి ఈనెల 30న పదవీ విరమణ చేయుచున్న గాజుల పెద్ద వీరప్ప పదవి విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మౌలాలి అజాం బేగ్, గోపాలకృష్ణ,చంద్రశేఖర్ సుబ్బరాయుడు, గిరిపోయిన నాగేంద్రల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 38 ఏళ్ల సర్వీసులో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాడని, క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందించారని, ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకాలను విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉత్తీర్ణత శాతం పెంచేందుకే కాకుండా వారిలో ఆత్మస్థైర్యం నింపే విధంగా బోధన సాగించాడని వివరించారు. విద్యార్థులకు, ప్రభుత్వ విద్యారంగానికి, ఉపాధ్యాయ ఉద్యమ రంగానికి చేసిన సేవలను కొనియాడారు. ఓ ఉద్యోగికి పదవి విరమణ అనేది సహజమైన అంశమని డీఈఓలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాజుల పెద్ద వీరప్పను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకట్రాంరెడ్డి శివశంకర్ శ్రీనివాసులు సాంబశివుడు ఎంఈఓలు ప్రధానోపాధ్యాయులు వివిధ పాఠశాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పహల్గాంలో మృతి చెందిన భారతీయులకు సంతాపం

**సర్వేపల్లి నియోజకవర్గం జనసేన ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ**



**సర్వేపల్లి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దారుణ దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక భారతీయులకు గౌరవంగా సర్వేపల్లి నియోజకవర్గం జన సేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో ముత్తుకూరు సెంటరులో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ "భారతదేశం అన్నా, భారత సైన్యం అన్నా వణికిపోతున్న ఉగ్రవాదులు, ఆర్మీ యూనిఫామ్ ధరించి అమాయకుల పై దాడి చేయడం పిరికితనానికి నిదర్శనం. ధైర్యం ఉంటే నేరుగా పోరాడండి. భారత సైన్యం ఇప్పటికే ఇద్దరిని వేరి పారేసింది. మిగిలిన నలుగురి అంతు కూడా చూస్తుంది. మద్దతుదారులకూ అదే గతి తప్పదు." అలాగే పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, జనసేన పార్టీ ఈ ఘటనపై మూడు రోజుల పాటు సంతాప దినాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు, ముత్తుకూరు మండల అధ్యక్షుడు మనుబోలు గణపతి, మండల సీనియర్ నాయకులు సందూరి శ్రీహరి, రహీం, అశోక్, గిరీష్, సుమన్, మస్తాన్, రహమాన్, చిన్న తదితరులు పాల్గొన్నారు. అందరూ మౌనంగా దీపాలు వెలిగించి అమాయకుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ ర్యాలీ ద్వారా ఉగ్రవాదుల హింసాత్మక చర్యలకు వ్యతిరేకంగా బలమైన సందేశం పంపారు.

# జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ

**ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి మౌనంగా నివాళి**



**లోవిడి లక్ష్మీపురం, ఏప్రిల్ 24 (జనస్వరం) :** జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని లోవిడి లక్ష్మీపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ ప్రజల సమస్యలు, అభివృద్ధి ప్రణాళికలపై చర్చలు జరిపిన ఈ సభలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ద్వారపూడి పార్వతమ్మ, వైస్ ప్రెసిడెంట్ గౌరి నాయుడు, జనసేన నాయకులు జామి అనిల్, పంచాయతీ కార్యదర్శి నిమ్మక సరస్వతి, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు హాజరయ్యారు. సభ ముగింపు సందర్భంగా, జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక పౌరుల ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దుఃఖం వ్యక్తం చేస్తూ, తీవ్రవాద దాడులను ఖండించారు. గ్రామ సభలో స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలపై గ్రామస్తులు చురుకుగా స్పందించడం విశేషం.

# ఆర్పీఐ పార్టీకి మిరియాల వెంకటరమణయ్యకి ఎటువంటి సంబంధం లేదు

**రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోవూరు సురేష్**



**నెల్లూరు, ఏప్రిల్ 24 (జనస్వరం) :** పార్టీ పేరు మంత్రి పేరు చెప్పి లోన్లు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకి పాల్పడితే ఎవ్వరిని వదలమని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోవూరు సురేష్ తెలిపారు. పార్టీ పేరు మంత్రి పేరు చెప్పి లోన్లు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకి పాల్పడుతున్నారని, స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లోని ఆర్పీఐ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోవూరు సురేష్ మాట్లాడుతూ మిరియాల వెంకటరమణయ్య అనే వ్యక్తి ఇటీవలే లోన్లు ఉద్యోగాలు ఇప్పిస్తానని పలు మోసాలు చీటింగ్ కేసుల్లో జైలుకు వెళ్లాడని అన్నారు అతనిని మా పార్టీ నుంచి గతంలోఎప్పుడో బహిష్కరించామని, అతను మా పార్టీ పేరు చెప్పి ఫేక్ అపాయింట్మెంట్ లెటర్లు చూపించి మంత్రి ఫోటోలు చూపించి లోన్లు,ఉద్యోగాలు, తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనం టికెట్లు ఇస్తానని ఇతర దేశాల నుంచి ఫారెన్ ఫండ్ క్రిస్టియన్ సంస్థల అకౌంట్లో డబ్బులు వేయిస్తానని, చాలామంది దగ్గర భారీగా డబ్బులు వసూలు చేసి మోసాలు చేస్తూ పోలీస్ వారెంట్‌కి కూడా చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న వెంకటరమణయ్యను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఆర్పీఐ పార్టీ బాబా సాహెబ్ అంబేద్కర్ పెట్టిన పార్టీ అని, మహనీయుడు పెట్టిన పార్టీ పేరు చెప్పి లోన్లు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకి పాల్పడితే ఎంతటి వారినైనా చట్టపరంగా శిక్షించేంతవరకు వదలమని హెచ్చరించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్స్ పాత్రికేయులకు మీడియా మిత్రులకు ఒక విన్నపం ఆర్పీఐ పార్టీ పేరు చెప్పుకొని చాలామంది ఫేక్ లీడర్లు తిరుగుతున్నారని, అటువంటి వారిని గమనించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ నంబూరు గణేష్, ఆరికొండ సురేష్, డొక్కా చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు

# పహల్గాం ఉగ్రదాడిలో హతమైన హిందువులకు బీజేపీ నివాళి


**సనత్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ**



**హైదరాబాద్, ఏప్రిల్ 24 (జనస్వరం) :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన తీవ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన హిందూ పౌరులకు గౌరవంగా నివాళులర్పిస్తూ బీజేపీ నాయకులు కోవొతుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం సనత్‌నగర్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఆకుల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో బికెగూడా జయ భారతి హైస్కూల్ చౌరస్తా వద్ద నిర్వహించారు. ఉగ్రవాద దాడులను ఖండిస్తూ, దేశ భద్రతకు బీజేపీ కట్టుబడి ఉందని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పౌరుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పూర్తి నమ్మకమున్నామని, ఈ విధంగా నిర్దోషులపై జరిగే దాడులను దేశం మొత్తం కలిసికట్టుగా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని మౌనంగా నివాళులర్పించారు. పహల్గాంలో హతమైన వారందరికీ శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, దేశ భద్రతకు తమ అంకితభావాన్ని పునరుద్ఘాటించారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ





**బొంరాస్‌పేట, ఏప్రిల్ 24 (జనస్వరం) :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 71 మంది, దుద్యాల మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతి రెడ్డి, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి గురువారం కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.పీఎసిఎస్ చైర్మెన్ జయకృష్ణ,దుద్యాల తహశీల్దార్ కిషన్ నాయక్, డిప్యూటీ తహసిల్దార్ వీరేష్ బాబు, బొంరాస్‌పేట ఎంపీడీవో వెంకన్ గౌడ్, ఆర్ఐ శిరీష, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, ఆవుటి శేఖర్, పీఎస్‌సీఎస్‌సీ చెర్మన్ జయకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చెర్మన్ వెంకట్ రాములు గౌడ్. రాంచంద్రరెడ్డి, మల్లేష్, అంజిల్ రెడ్డి, నర్సిములు నాయుడు, బందప్ప గౌడ్, గణపూర్ చిన్న నర్సిములు గౌడ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ అవార్డుల ప్రధానోత్సవం



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 24 (జనస్వరం) :** లింగన్ పల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రాడ్యుయేషన్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల్లో నృత్యాలు పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మంజుల, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి, ఉపాధ్యాయులు అమూల్య, నరేష్ అంగన్వాడీ టీచర్లు సుగుణ, జగదీశ్వరి, అర్చన తదితరులు పాల్గొన్నారు.

# కాశ్మీర్ ఉగ్రదాడి మృతులకు సంతాపంగా ర్యాలీ



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 24 (జనస్వరం) :** జమ్మూ కాశ్మీర్లోని పహల్గంలో భారతీయ పౌరులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ ఆర్ఎస్ఎస్, హిందు వాహిని, యువకులు మండల కేంద్రంలోని భూ లక్ష్మమ్మ చౌరస్తాతో పాటు, నాందార్ పూర్ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి మౌనం పాటించి నివాళులర్పించారు. అంతకుముందు గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

# పహల్గాం ఉగ్రవాదుల దాడిపై శాంతియుతంగా నిరసన



**యలమంచిలి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** జమ్మూ కాశ్మీర్ పహల్దాం ఉగ్రవాదుల దాడిలో భారతీయులను 26 మందిని దారుణంగా దాడికి నిరసనగా నియోజకవర్గ కూటమి నాయకుల ఆదేశాల మేరకు గురువారం స్థానిక మెయిన్ రోడ్‌పై శాంతియుతంగా నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పట్టణ టీడీపీ అధ్యక్షులు, గొర్లె నానాజీ, కొఠారి సాంబ, జనసేన రూరల్ అధ్యక్షులు అన్నం బాబ్జి, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, పిట్ట శ్రీను, లవడు లావరాజు, లాలం సోమనాయుడు, బొద్దపు రమణ, నమ్మి రమణ, కరణం రవి, గొర్లె బాబురావు, కోటార్ శ్రీను, ఊటకోట రమేష్. గుర్రాల రాము, గుర్రాల శేఖర్, కోనకృష్ణ, భోజజయరాం, లంక రాజు, మల్లికార్జునరావు, దుప్పట్ల శంకర్ చిట్టిబాబు, శివ, టౌన్ రూరల్ కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల అభివృద్ధే ధ్యేయం : యార్లగడ్డ




**ఉంగుటూరు, ఏప్రిల్ 25 (జనస్వరం) :** గన్నవరం నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఉంగుటూరు మండలం ఇందుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్‌ను గురువారం రాత్రి ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా పదవతరగతి లో జిల్లా ఫస్ట్ సాధించిన దుర్గ యశ్వంత్(591), ద్వితీయస్థానం సాధించిన నాగేంద్ర (589)లతో పాటు 504 మార్కులు పైన సాధించిన 10 మంది ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికుల వినతికి సానుకూలంగా స్పందించిన యార్లగడ్డ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో డ్రైనేజీలోతు ఎక్కువగా ఉండటంతో గ్రామస్తులు డ్రైనేజీలో పడి గాయలపాలవుతున్నారని సమస్యను పరిష్కరించాలని కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ సమస్యలు తెలుసుకునేందుకు వచ్చానని చెప్పారు. నియోజకవర్గం మొత్తానికి రూ.22 కోట్లు ఉపాధి నిధులు వస్తే ఈ గ్రామానికి రూ. 91 లక్షలు ఇచ్చానని వివరించారు. నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యే అయిన తరువాత ఇప్పటి వరకు 6700మందికి ఉద్యోగాలు ఇప్పించానని గుర్తు చేశారు. ప్రజలపై తప్పుడు కేసులు పెట్టలేదు పెట్టబోనని భరోసా ఇచ్చారు. మరో 18నెలల్లో మలవల్లి గ్రామంలోని మోడల్ పారిశ్రామిక వాడలో 300 కంపెనీలు రానున్నాయని, తద్వారా నిరుద్యోగ సమస్య కొంతవరకు పరిష్కారం అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తానుఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తానని హామీ ఇచ్చారు. మరో సంవత్సర కాలంలో నియోజకవర్గంలో 15వేల మందికి ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. గ్రామంలో నీటి కొరత తీర్చడానికి రెండు చేతి పంపులు కావాలని స్థానికుల కోరగా వెంటనే వెంటనే చేతిపంపులు నిర్మించాలని అధికారులు ఆదేశించారు. విద్యుత్ ప్రమాద బాధతునికి సాయం చేస్తామని ఎస్ ఈ తో ఫోన్లో మాట్లాడి హామీ ఇచ్చారు. వివిధ కంపెనీల సిఎస్సార్ నిధులతో వైద్యశాలల అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతిమూడునెలలకు రోగుల వద్దకు వెళ్లి రక్తపరీక్షలు చేయాలని వైద్యసిబ్బందికి అదేసలిచ్చారు. కండ్రిక రోడ్‌లో విద్యుత్ తీగలు చేతికి తగులుతున్నాయని, వెంకటరామాపురంలో స్తంబాలు పడిపోయేలా ఉన్నాయన్న స్థానికుల ఫిర్యాదుపై స్పందించిన యార్లగడ్డ వారం రోజుల్లో సరి చేయాలని విద్యుత్ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఆరుమళ్ళ వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు రాంబాబు, బెనర్జీ, లక్ష్మణ, రాము, తహసీల్దార్ నిర్మలకుమారి, ఎండీఓ జోగేశ్వరావు, ఏవో హరీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మానికొండ గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

## ఓహో ఓహో వసంతమా..
## సుమ బాల పరిమళ విలాసమా...



**పులివెందుల ఏప్రిల్ 24 (జనస్వరం) :** వసంత మాసం అనేది వసంత రుతువులో వచ్చే మొదటి మాసం, ఇది హిందూ పంచాంగం ప్రకారం మార్చి లేదా ఏప్రిల్ నెలలో ప్రారంభమవుతుంది. ఇది శీతాకాలం ముగిసి వేసవి ప్రారంభానికి ముందు వచ్చే కాలం. భారతీయ కాలగణనలో ఒక రుతువు వసంత రుతువులో వచ్చే మాసాలు. ఇది సాధారణంగా చైత్ర మాసం, వైశాఖ మాసంలుగా పరిగణించబడుతుంది. ప్రకృతి అంతా సౌందర్యంగా ఉంటుంది. అందుకే ఓహో ఓహో వసంతమా.. నవ మోహన జీవన వికాసమా.. సుమ బాల పరిమళ విలాసమా అంటూ ఒక కవి జానపద గేయం రాశారు. భారతదేశంలో వివిధ కాలాలలో వాతావరణంలో ఏర్పడే మార్పులను బట్టి సంవత్సరాన్ని ఆరు రుతువులుగా విభజించారు. వాటిలో ఒకటి వసంత రుతువు. వసంత రుతువులో చెట్లు చిగురిస్తాయి. ఉగాది పండగతో ఈ రుతువు ఆరంభం అవుతుంది. చైత్ర, వైశాఖ మాసంలలో చెట్లు చిగురించి పూవులు పూయు కాలం. వసంత రుతువు శీతలం నుండి వేసవికి మారే కాలం మధ్యలో సమ శీతల మండల ప్రాంతంలో ఉత్తరార్ధగోళంలో మార్చి – ఏప్రిల్, అలాగే దక్షిణార్ధగోళంలో సెప్టెంబర్–అక్టోబర్‌లో వస్తుంది. భారతీయ పురాణాలలో వసంత రుతువు సరస్వతి నేర్చుకునే దేవతకి ఇష్టపడే కాలంగా పరిగణించబడుతుంది. దీనిని "వసంత రుతువు దేవత" (శారద) అని కూడా పిలుస్తారు. ఆసియా ఆధ్యాత్మికతలో వసంత రుతువు లోహపు మూలకంతో సంబంధం కలిగి ఉంటుంది. ఆకురాల్చే చెట్లు దొరికిన చోట ఆకులలో రంగు మార్పు సంభవిస్తున్నప్పటికీ, ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో రంగు వసంత రుతువు ఆకులు గుర్తించబడతాయి. చెట్లపై పసుపు, నారింజ ఎరుపు ఆకులతో వసంత రుతువు దృశ్యం నేలమీద పడిపోతుంది. మధ్యయుగ కాలంలో 12 వ శతాబ్దం నాటికి దాని వాడకానికి అరుదైన ఉదాహరణలు ఉన్నాయి, కానీ 16 వ శతాబ్దం నాటికి ఇది సాధారణ వాడుకలో ఉంది. వసంతంలో చెట్లు, మొక్కలు పూలతో ముస్తాబవుతాయి. ప్రకృతి అందంగా మెరుస్తుంది. వసంత రుతువును ఆరోగ్యానికి మంచిదిగా భావిస్తారు. ఇది సమతుల్యమైన ఉష్ణోగ్రత కలిగి ఉంటుంది. హోలీ – రంగుల పండుగ, వసంత రుతువు ప్రారంభంలో జరుగుతుంది. ఉగాది – తెలుగు నూతన సంవత్సరం చైత్ర మాసంలో ప్రారంభమవుతుంది. శ్రీరామనవమి – రాముని జన్మోత్సవం కూడా వసంత మాసంలో ఉంటుంది. వేదాల ప్రకారం వసంతం రుతురాజు అని పిలవబడుతుంది, అన్ని రుతువులకు రాజు. ఇది సౌందర్యం, ప్రేమ, కొత్త ప్రారంభాలుగా పరిగణించబడుతుంది. ప్రకృతి పరంగా పుడమి తల్లికి ఇన్ని ప్రయోజనాలు ఉన్న వసంత మాసాన్ని ఆస్వాదిద్దాం.

## ముత్యాలమ్మ ఆలయం వద్ద గుర్తు తెలియని సాధువు మృతి

**చింతపల్లి ఎస్సై వెంకటేశ్వరరావు**



**చింతపల్లి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** మండలంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆవరణలో గుర్తు తెలియని సాధువు మృతి చెందిన ఘటన స్థానికులను కలిచివేసింది. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వారం రోజులుగా సాధువు అనారోగ్యంతో బాధపడుతున్నటు మృతి చెందినట్టు సమాచారం. తోటి సాధువుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్య సమస్యల కారణం గానే ఇది జరిగి ఉండొచ్చని భావిస్తున్నాం అన్నారు. మృత సాధువు వివరాలు తెలియకపోవడం నేపథ్యంలో, అతని కుటుంబ సభ్యులను గుర్తించే చర్యలు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా, మృతదేహాన్ని ఆదివారం వరకు చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో ఉంచినట్లు చెప్పారు. అతని గురించి ఎవరైనా వివరాలు తెలిస్తే, వెంటనే చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ వెంకటేశ్వరరావు కోరారు.

## అండమాన్‌లో టీడీపీ మరో ఘన విజయం

**శ్రీ విజయపురం మున్సిపల్ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా షాహుల్ హమీద్**

**మంగళగిరి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** తెలుగుదేశం పార్టీ (టీడీపీ)కు అండమాన్ నికోబార్ దీవుల్లో మరో విజయపతాక ఎగిరింది. శ్రీ విజయపురం మున్సిపల్ కౌన్సిల్ (SVPMC) చైర్‌పర్సన్‌గా టీడీపీకి చెందిన ఎస్.షాహుల్ హమీద్ ఎన్నికయ్యారు. ఆయన బీజేపీ – టీడీపీ కూటమి అభ్యర్థిగా వార్డ్ నం.1 నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఈ ఎన్నిక గురువారం, ఏప్రిల్ 24న దక్షిణ అండమాన్‌లోని SVPMC కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. మొత్తం 24 ఓట్లలో 15 ఓట్లు సాధించిన షాహుల్ హమీద్, కాంగ్రెస్ అభ్యర్థి సుదీప్ రాయ్ శర్మపై విజయాన్ని నమోదు చేశారు. సుదీప్ రాయ్ శర్మకు కేవలం 9 ఓట్లు మాత్రమే లభించాయి. ఈ విజయంతో ఎస్. షాహుల్ హమీద్ SVPMC చైర్‌పర్సన్‌గా నియమితులైన రెండవ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా చరిత్రలో నిలిచారు. అలాగే టీడీపీ – బీజేపీ కూటమి దక్షిణ అండమాన్‌లో తన రాజకీయ స్థిరతను మరింత బలపరిచింది. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, అండమాన్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ వి. మాధవ నాయుడు ఎన్నికల సన్నాహాలను సమర్థవంతంగా పర్యవేక్షించినట్లు తెలియజేశారు. ఆయన కూటమి వ్యూహాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మణిక్య రావు యాదవ్ ఈ విజయాన్ని సమర్పించుకుంటూ మాట్లాడుతూ "ఈ గెలుపు కూటమి స్థిరతకు, ప్రజల విశ్వాసానికి నిదర్శనం. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అజోయ్ బైరాగి, SVPMC ఎన్నికల కమిటీ సభ్యులు, కార్యకర్తల సహకారం వల్లే ఈ విజయం సాధ్యమైంది" అని పేర్కొన్నారు. అలాగే ఆయన భవిష్యత్తులో పార్టీ కింది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించబోతున్నట్లు తెలిపారు. ఈ విజయంతో శ్రీ విజయపురం మున్సిపాలిటీ ప్రాంతంలో టీడీపీకి ప్రగాఢమైన ప్రజానిబంధన కలగడం స్పష్టమవుతోంది. అభివృద్ధి, పారదర్శక పాలన, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకత్వం హామీ ఇచ్చింది.

## "పది" ఫలితాల్లో రాపర్తి గ్రామ అమ్మాయి ప్రతిభ



**పిఠాపురం, ఏప్రిల్ 24 (జనస్వరం) :** మండలంలోని రాపర్తి గ్రామానికి చెందిన డీఎస్ఎన్‌వీ పూజ, పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచింది. 580 మార్కులకు 600 మార్కులు సాధించి, రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మొదటి స్థానాన్ని సాధించింది. ఈ విజయంతో పూజ కుటుంబానికి, గ్రామానికి, స్కూల్‌కు పేరు తెచ్చింది. రూరల్ మండల స్థాయిలో ఒక గ్రామీణ విద్యార్థిని ఈ స్థాయిలో మెరిసిపోవడం పట్ల గ్రామస్తులు, పెద్దలు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. పలువురు వ్యక్తిగతంగా ఇంటికి వెళ్లి పూజను సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం మాణిక్యాలరావు రాపర్తి జెడ్పీహెచ్ స్కూల్ విద్యా కమిటి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వారి కుటుంబంలో నుంచి వచ్చిన ఈ విద్యార్థిని ఈ ఘనత సాధించడం మరింత విశిష్టతను సంతరించుకుంది.

## బస్సులో ప్రాణాలు వదిలిన మహిళ



**పులివెందుల ఏప్రిల్ 24 (జనస్వరం) :** బస్సులో ప్రయాణిస్తూ ఓ మహిళ చనిపోయిన ఘటన కడప జిల్లా సింహాద్రిపురం మండలంలోని బలుపునూరులో గురువారం చోటుచేసుకుంది. ప్రయాణికుల వివరాల మేరకు మహిళ ఓ చిన్న పాపతో కలిసి తాడిపత్రి నుంచి సింహాద్రిపురం వైపు బస్సులో ప్రయాణిస్తుండగా బలపనూరు గ్రామంలోకి రాగానే తను కూర్చున్న సీట్లోనే ప్రాణాలు వదిలింది. కండక్టర్ పోలీసులకు సమాచారం అందించారు.

# అమరావతికి సింహద్వారంగా విజయవాడను తీర్చిదిద్దుతాం

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- వైసీపీ హాయంలో విజయవాడ అభివృద్ధికి ఒక్క రూపాయి కేటాయించలేదు
- 2014లో చేపట్టిన పనులన్ని ఇప్పుడు మళ్ళీ మొదటికొచ్చాయి
- విజయవాడ అభివృద్ధికి నిధులు కొరత లేదు
- 9వ డివిజన్‌లో రూ.170 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**విజయవాడ, ఏప్రిల్ 24 (జనస్వరం) :** రాష్ట్ర రాజధాని అమరావతికి సింహద్వారంగా నగరాన్ని తీర్చిదిద్దుతామని ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. గురువారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్, జ్యోతి కన్వెన్షన్ దగ్గర ప్రగతి నగర్, 1వ లైన్ ప్రాంతంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. ఎస్‌వీఎస్ కళ్యాణ మండపం దగ్గర డ్రైనేజీ పనులను, పటమట లంక కట్ట మీద వాటర్ పైప్‌లైన్ పనులకు ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈ డివిజన్‌లో ఈ రోజు కోటి 70 లక్షల రూపాయలతో డ్రైనేజీ, రోడ్లు, వాటర్ పైపులైన్ పనులను శంఖుస్థాపన చేశామని, చాలావరకు పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఉన్న విజయవాడ నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని విధాలుగా సహకరిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజయవాడ నగరంలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. 2014వ సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వ హాయంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, 2019వ సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ అభివృద్ధి పనులను పూర్తి చేయలేదన్నారు. 2014లో టీడీపీ చేపట్టిన పనులను అన్నింటినీ మళ్ళీ ఇప్పుడు మొదటి నుంచి చేపట్టాల్సిన పరిస్తితులు ఏర్పడ్డాయని, వాటిని చేపడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఎంపీ కేశినేని శివనాథ్ తనకున్న అన్ని వనరులను ఉపయోగించి నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. 2014లో సీఎంగా ఉన్న చంద్రబాబు విజయవాడను రాష్ట్ర రాజధానిగా ప్రకటించి అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. 2019వ సంవత్సరంలో సీఎం అయిన వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి విజయవాడ అభివృద్ధికి రూ.150 కోట్లు మంజూరు చేస్తున్నానని అసెంబ్లీలో ప్రకటించగా, తన ఐదు సంవత్సరాల పాలనలో జగన్ మోహన్‌రెడ్డి ఒక్క రూపాయి కూడా కార్పొరేషన్ ఖజానాకు జమ చేయలేదని చెప్పారు. 2024వ సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.300 కోట్లను వివిధ దశల్లో నగరాభివృద్ధికి మంజూరు చేసిందని చెప్పారు. అంతేకాకుండా నగరాభివృద్ధికి ఏమీ కావాలో డీపీఆర్ సిద్ధం చేసి తమకు అందచేస్తే ఎన్ని వేల కోట్ల రూపాయిలైనా మంజూరు చేయడానికి సీఎం చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. మద్రాస్ ఐఐటీ వంటి ఉన్నతమైన సంస్థలతో సంప్రందించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. విజయవాడ అభివృద్ధికి నిధుల కోరత, కొదవ లేదన్నారు. అమరావతికి విజయవాడను సింహద్వారంగా తయారు చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. పది నెలల కాలంలో తూర్పు నియోజకవర్గంలోని ఒకొక్క డివిజన్‌లో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వర్షాకాలంలో ఇబ్బంది పడకుండా డ్రైయిన్లు మరమ్మత్తు చేసుకోడానికి రూ.50 కోట్లు మంజూరు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఎంపీ కేశినేని శివనాథ్ నగరాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని చెప్పారు. చెన్నుపాటి గాంధీ మాట్లాడుతూ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. గతంలో రెండు సార్లు గద్దె రామమోహన్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, ఇప్పుడు మూడో సారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మరిన్ని ఎక్కువ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చేయిస్తున్నారని, అందుకు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి దేవేంద్ర, సొంగా సంజయ్ వర్మ, పోతంశెట్టి నాగేశ్వరరావు, సూరపనేని సురేష్, చిలకపూడి లక్ష్మీ నరసింహారావు, అన్నాబత్తుల శ్రీదేవి, కడియాల దుర్గా భవాని, మొటపర్తి లక్ష్మి, వీఎంసీ ఈఈ. సామ్రాజ్యం, ఏఈ జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకతీతంగా సంస్కృతీ సంప్రదాయాలను నిర్వహించుకోవాలి : బీటెక్ రవి



**పులివెందుల, ఏప్రిల్ 24 (జనస్వరం) :** రాజకీయాల కతీతంగా మన సంస్కృతి సంప్రదాయాలను నిర్వహించుకోవాలని టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి అన్నారు. నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు గ్రామంలో అమ్మవారి తిరుణాల సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిభింబించేలా బండలాగుడు పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. రైతులందరు రాజాకీయాలతో సంబంధం లేకుండా ఈ పోటీలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోరారు కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు వెంపల్లె మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, తొండూరు మండల పరిశీలకుడు మారెడ్డి జయ భరత్ రెడ్డి, పులివెందుల మాజీ టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి వేముల మండల టీడీపీ నాయకుడు అంకిరెడ్డి అంకాలమ్మ గూడురు టీడీపీ నాయకులు, అమర్నాథ్ రెడ్డి, అంకి రెడ్డి, బాబు రెడ్డి, సాంబశివరెడ్డి, శివ మోహన్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, సదాశివ రెడ్డి, గ్రామ ప్రజలు ఆలయ కమిటీ చైర్మన్ సోమా కొండారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## త్వరలో పాపాగ్ని నదికి కృష్ణా జలాలు : టీడీపీ



**పులివెందుల, ఏప్రిల్ 24 (జనస్వరం) :** వేంపల్లి సమీపంలో పాపాగ్ని నదికి త్వరలో కృష్ణ జలాలను తీసుకువస్తామని స్థానిక టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి స్పష్టం చేశారు. వేంపల్లి మండలం చింతల మడుగు పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీటిని నింపామన్నారు. యుద్ధ ప్రాతిపదికన నంది పల్లె చెరువుకు నీటిని అందించి. అక్కడ నుంచి కాలువల ద్వారా వేంపల్లి పాపాఘ్న నదికి కృష్ణాజిల్లాలను చేరావేస్తామన్నారు. ఎండిపోతున్న పంటలకు నీరు అందించి కాపాడుతామని భరోసా ఇచ్చారు. ఫైనల్స్ ఇయర్ ఎండింగ్ కాబట్టి రోడ్డు పనులు ఆలస్యమవుతున్నాయని, త్వరలో సీఎం చంద్రబాబుతో మాట్లాడి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి, రోడ్డు పనులను పూర్తి చేస్తామని తెలిపారు. వేంపల్లి పాపాఘ్న నదికి నీరు వస్తే.. తాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు.

## భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా పంచాయతీ దినోత్సవం వేడుకలు



**దెందులూరు, ఏప్రిల్ 24 (జనస్వరం) :** పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పారిశుధ్య పరిరక్షణ తాగునీటి సరఫరా అన్ని రకాల సమస్యలు పరిష్కరిస్తూ గ్రామంలో గ్రామ సుపరిపాలన అందించడమే పంచాయతీ వ్యవస్థ యొక్క ముఖ్య ఉద్దేశమని భీమడోలు పంచాయతీ కార్యదర్శి తనూజ అన్నారు. గురువారం నియోజకవర్గంలోని భీమడోలు పంచాయతీ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ముందుగా జమ్మూ అండ్ కాశ్మీర్‌లోని పెహల్గాం వద్ద ఉగ్ర దాడిలో మరణించిన వారికి పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించి ఒక నిమిషం మౌనం పాటించారు. తదుపరి కళాజాత వారితో శానిటేషన్ పై ప్రత్యేక కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం



**యలమంచిలి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** పట్టణంలో స్థానిక శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 – 26 విద్యా సంవత్సరంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయడానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమ.చంద్రశేఖర్ తెలిపారు. ఎంఎస్సీకి సంబంధించి ఎనలిటికల్ కెమిస్ట్రీ ఒకటి, డిగ్రీకి సంబంధించి ఫిజిక్స్, కామర్స్, బాటని, హిస్టరీ, ఇంగ్లీషు సబ్జెక్టులలో ఒక్కో ఖాళీ ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతానికి మించి మార్కులు కలిగిన అభ్యర్థులపై పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. దీనితో పాటు యూజీసీ నియమ నిబంధనలు ప్రకారం నెట్, స్లెట్, పీహెచ్డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కళాశాలలో దరఖాస్తులను సమర్పించి ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు కళాశాల ఐక్యూఏసీలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వీరితో పాటు కళాశాలలో 2024 – 25 విద్యా సంవత్సరంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పూర్తి విధులు నిర్వర్తించిన బోటని – 1 కెమిస్ట్రీ – 3 కంప్యూటర్ సైన్స్ – 2 లైబ్రరీ సైన్స్ – 1 హిందీ – 1 విభాగాల అధ్యాపకులు కూడా ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమ చంద్రశేఖర్ తెలియజేశారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఉగ్రవాద దాడి మృతులకు నివాళులు



**కిర్లంపూడి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో పర్యాటకులు మరణించిన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా ఉగ్రవాద చర్యలపై నిరసన తెలియజేస్తూ, ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారికి కన్నీటి నివాళులర్పిస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసేలా మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల బీజేపీ అధ్యక్షులు శరకణం రాజబాబు తెలిపారు. దానిలో భాగంగా మండల పార్టీ అధ్యక్షులు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో గురువారం జగపతినగరంలో కొవ్వొత్తులతో ఉగ్రవాద దాడిలో మృతులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా ఉత్తమ సర్పంచ్‌గా ఎంజె పురం సర్పంచ్ కరెడ్ల బుల్లెమ్మ



**యలమంచిలి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** ఏప్రిల్ 24 గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయంలో విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఉత్తమ సర్పంచ్ గా ఎంపిక చేశారు అనకాపల్లి జిల్లా నుంచి కలెక్టర్ విజయ్ కృష్ణన్ దత్తత గ్రామం అయినటువంటి యలమంచిలి నియోజకవర్గంలోని ఎం జగన్నాథపురం గ్రామాన్ని ఎంపిక చేసి సర్పంచ్ కరేడ్ల బుల్లెమ్మకు విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఉత్తమ సర్పంచ్ పురస్కారాన్ని బహుకరించి సాలువాతో సత్కరించారు. పురస్కారం అనంతరం సర్పంచ్ బుల్లెమ్మ మాట్లాడుతూ ఈ అవార్డుకు ఎంపికైనందుకు ఎంతో ఆనందంగా ఉందని, ఈ ఉత్సాహంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి, నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌కి, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కి మంచి పేరు ప్రత్యేకతలు తీసుకువస్తానన్నారు.

# టీమ్ వర్క్‌తో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలపాలి

- తాగునీటి ఎద్దడి నివారణకు అత్యధిక ప్రాధాన్యత నివ్వాలి
- ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు పూర్తిచేయాలి
- పీజీఆర్ఎస్‌లో అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి
- రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహార్..



**ఏలూరు, ఏప్రిల్ 23 (జనస్వరం) :** పేద ప్రజల సంక్షేమం ఆకాంక్షిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలు సాధించడానికి అధికారులంతా టీమ్ వర్క్‌తో పనిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ల్యాండ్ అసైన్మెంట్ ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిసి పనిచేయడం ద్వారా సమస్యలకు మరింత సమగ్రమైన పరిష్కారాలను కనుగొనవచ్చున్నారు. టీమ్ వర్క్ ద్వారా పనులు వేగంగా, సమర్ధవంతంగా పూర్తవుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాను ఐదో స్థానం నుంచి మూడవ స్థానానికి తీసుకురావాలన్నారు. ల్యాండ్ అసైన్మెంట్‌లో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ప్రణాళిక బద్ధంగా ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు కల్పించాలన్నారు. జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. పీ-4 కార్యక్రమం కింద ప్రతి కుటుంబంలో ఒకరికి ఉపాధి, వ్యాపారవేత్తగా తీసుకురావడానికి అనువైన పరిస్థితులు కల్పించాలన్నారు. జిల్లాలో వెదురుతో తయారుచేసే ఉత్పత్తులకు ఇతర జిల్లాలలో మార్కెటింగ్ సదుపాయం కలిగే విధంగా నైపుణ్య శిక్షణ అందించాలన్నారు. వారికి అవసరమైన వెదురు సరఫరాలో ఎటువంటి అవరోధాలు లేకుండా అటవీశాఖ అధికారులు చూడాలన్నారు. ప్రభుత్వం అమలుచేసే అన్ని సంక్షేమ కార్యక్రమాలు పార్టీలకు అతీతంగా క్షేత్రస్థాయిలో చివరిస్థాయి వరకు అర్హులైన లబ్దిదారులకు అందించడంలో శ్రమించాలన్నారు. దీపం పథకం మొదటి దశలో సబ్సిడీ అందించామని, అదే విధంగా రెండవ దశలో కూడా లబ్దిదారులకు అందించడంలో ఎంపిడివోలు, తహశీల్దార్లు సమిష్టిగా సమీక్షించాలన్నారు. హౌసింగ్ విషయంలో కూడా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలన్నారు. త్వరలో 9,407 కోట్ల రూపాయలతో తల్లికి వందనం అమలు చేయబోతున్నామన్నారు. ఈ విషయంలో వాస్తవాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం వర్తంప చేస్తామన్నారు. జూన్ 12న పాఠశాలలు తెరచిన వెంటనే రాష్ట్రంలోని 41 వేల పాఠశాలలు, 4 వేల సంక్షేమ హాస్టల్స్‌లో మధ్యాహ్నం భోజనం పథకం అమలుకు నాణ్యమైన బియ్యం సరఫరాచేసే కొత్త విధంగా ప్రభుత్వం అమలు చేయబోతుందన్నారు. తాగునీటి విషయంలో అత్యధిగా ప్రాధాన్యతనిచ్చి నీటి ఎద్దటి నివారణను ఛాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ వారి దగ్గర అందుబాటులో నిధులు ఉంచడమైందన్నారు. మరి ముఖ్యంగా పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులకు ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించాలన్నారు. ఈ విషయంలో సంబంధిత శాఖలు అన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. అంత్యోధయ అన్నయోజన కింద ప్రతి కుటుంబానికి 35 కిలోలు బియ్యం ఉచితంగా అందించే కార్యక్రమం ప్రారంభించామని, ఈ విధంగా ఏలూరు జిల్లాలో 8 వేల మందికి అందిస్తున్నామన్నారు. జిల్లా అభివృద్ధే ద్యేయంగా ప్రతినెలా రెండు మూడు రోజులు జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని తెలిపారు. రెవిన్యూ సమస్యలు తలెత్తకుండా తహశీల్దార్లు తమ స్థాయిలో స్పందిస్తే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల వరకు రావని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి చిన్న చిన్న సమస్యలు తమ స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. మరి ముఖ్యంగా ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్‌లో అందే అర్జీలను వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి వినతులను, సమస్యలను గౌరవ ప్రధంగా స్వీకరించాలన్నారు. ఆయా శాఖల పరిధిలో అమలుచేసే కార్యక్రమాల సమాచారాన్ని ఆయా స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, వివిధ శాఖల అధికారులు, తహశీల్దార్లు, యంపిడివోలు పాల్గొన్నారు.

# ప్రారంభమైన చింతపల్లి ముత్యాలమ్మ అమ్మవారి జాతర

- జాతరలో ఎక్కడ ఎటువంటి ఆవంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు



**చింతపల్లి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** మన్యం ఆరాధ్య దైవం, గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఉత్సవ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దురియ హేమంత్ కుమార్, పసుపులేటి వినాయకరావు, పోతురాజు బాలయ్య ల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ జాతర 24 నుంచి 27 వరకు నిర్వహించబడుతుందని వారు తెలిపారు. 110 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఉత్సవం, పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర తర్వాత ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జరిగే అతిపెద్ద జాతరగా గుర్తించబడింది. ఈ జాతరలో ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేకమైన పూజలు, పసుపు, కుంకుమలు సమర్పించి, సాంస్కృతిక కార్యక్రమాలు ద్వారా నిర్వహిస్తారు. ఈ జాతరలో భాగంగా అమ్మవారి గరగలు సుర్ల వారి వంశీయుల స్థావరాల నుంచి సతకం పట్టు వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సతకం పట్టు వద్ద ప్రత్యేక సంబరాలు నిర్వహించి, చింతపల్లి ప్రాంతంతో పాటు తమ కుటుంబ సభ్యులు చల్లగా ఉండాలని దర్శించుకుని, మొక్కులు తీర్చుకుంటారు. ముత్యాలమ్మ జాతరకు ఎన్నడు లేని రీతిలో హర్షం నెలకొంది. భక్తుల రాకపోకలతో గ్రామం సందడిగా మారింది. ఈ సందర్భంగా దుకాణదారులు పెద్ద సంఖ్యలో పోటీ పడి తాత్కాలిక షాపులను ఏర్పాటు చేశారు. వీటిలో పూజా సామగ్రి, జవళీలు, ఆభరణాలు, బొమ్మలు, పిల్లల ఆటబొమ్మలు, ఫుడ్ స్టాళ్లు వంటి వాటితో పాటు స్థానిక హస్తకళలతో కూడిన వస్తువులు కూడా ఉన్నాయి. వాణిజ్య దృష్టితో చాలా మంది వ్యాపారులు పొరుగు గ్రామాలు, పట్టణాల నుంచి కూడా వచ్చి తమ దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇది జాతరకు వాణిజ్యరంగంలో కొత్త ఊపునిస్తూ, స్థానికులకు ఆదాయ మార్గాలు అందిస్తోంది. జాతర వేళలో ఇలాంటి వాణిజ్య చర్యలు ఆర్థికంగా గ్రామానికి చక్కటి అవకాశాలను కలిగిస్తున్నాయి. ఈ సంవత్సరం భక్తుల సంఖ్య రికార్డు స్థాయిలో ఉండే అవకాశం ఉన్నందున, దుకాణదారుల ఉత్సాహం మరింతగా కనిపిస్తోంది. ముత్యాలమ్మ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని గుర్తించి, భద్రతా పరంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, పోలీస్ పికెట్లు, క్యూలైన్లు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, భక్తుల రక్షణకు ప్రతి జాగ్రత్త తీసుకుంటున్నారు.

# డాక్టర్ జి.సతీష్ రెడ్డి రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా బాధ్యతలు స్వీకరణ

- ఏరో స్పేస్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ అభివృద్ధికి అనుభవం కీలకం
- ఎంపీ కేశినేని శివనాథ్



**మంగళగిరి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారుడిగా నియమితులైన డీఆర్డీఓ మాజీ చైర్మన్ డా. జి. సతీష్ రెడ్డి గురువారం మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), డా. సతీష్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ "రాష్ట్రానికి డిఫెన్స్, ఏరో స్పేస్ పరిశ్రమలను ఆకర్షించేందుకు సతీష్ రెడ్డి అనుభవం ఎంతో ఉపయోగపడనుంది. సీఎం చంద్రబాబు తీసుకుంటున్న అభివృద్ధి నిర్ణయాలతో రాష్ట్ర పరిశ్రమల రంగం గణనీయంగా ఎదుగుతోంది" అని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో అమరావతిలో క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించనున్నట్లు చెప్పారు. "స్పోర్ట్స్ సిటీతో పాటు స్థల కేటాయింపు అనంతరం రెండు సంవత్సరాల్లో క్రికెట్ స్టేడియం పూర్తి చేస్తాం," అని తెలిపారు. డా. సతీష్ రెడ్డి మాట్లాడుతూ "రాష్ట్రాన్ని డిఫెన్స్ మానుఫ్యాక్చరింగ్ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నన్ను గౌరవ సలహాదారుడిగా నియమించిన సీఎం చంద్రబాబుకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో త్వరలోనే పరిశ్రమల అభివృద్ధిలో ముందడుగు వేస్తాం" అని తెలిపారు. హైదరాబాద్ వెళ్లే మార్గంలో విజయవాడ-అమరావతి మార్గం, అనంతపురం, విశాఖపట్నం, కర్నూలు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో డిఫెన్స్ క్లస్టర్స్ ఏర్పాటుపై అధికారులతో కలిసి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనసేన సీనియర్ నాయకుడు బంటుపిల్లి రాంబాబుకు గాయాలు

### పార్టీ నేతల పరామర్శ



**విజయవాడ, ఏప్రిల్ 24 (జనస్వరం) :** పశ్చిమ నియోజకవర్గంలోని 47వ డివిజన్‌కు చెందిన జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకుడు బంటుపిల్లి రాంబాబు, ఇటీవల మెట్ల నుండి జారిపడి కాళ్లకు తీవ్ర గాయాలు పొందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంటనే స్పందించారు. ఈ నేపథ్యంలో కృష్ణ, పెన్నా మహిళ కో ఆర్డినేటర్ మల్లెపు విజయలక్ష్మి, డివిజన్ అధ్యక్షులు పల్లంటి ఆది, రెడ్డిపల్లి గంగా, రెడ్డిపల్లి అనిత, రూట్ కోఆర్డినేటర్ భావిశెట్టి శ్రీనివాస్, రాంబాబు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "మీ వంటి నిస్వార్థ నాయకులు పార్టీకి బలంగా నిలుస్తున్నారు. ముందుగా మీరు ఆరోగ్యంగా ఉండాలి. జనసేన పార్టీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది," అని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా 47వ డివిజన్ కమిటీ సభ్యులు పరామర్శకు వచ్చిన ప్రతీ ఒక్కరికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు. బంటుపిల్లి రాంబాబు త్వరగా కోలుకుని పార్టీ సేవలో మరింత క్రియాశీలకంగా పాల్గొనాలనే ఆకాంక్షను కార్యకర్తలు వ్యక్తం చేశారు.

# టీఎన్టీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు

### మేడే పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)




**విజయవాడ, ఏప్రిల్ 24 (జనస్వరం) :** టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కుల రఘురామ రాజు ఆధ్వర్యంలో నిర్వహించబోయే మేడే వేడుకల పోస్టర్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మే 1 తేదీ సాయంత్రం 4గంటలకు మొగల్రాజపురంలోని పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో గల సిద్దార్థ హెూటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ గ్రౌండ్స్‌లో మేడే వేడుకలు నిర్వహిస్తున్నట్లు టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కుల రఘురామరాజు ఎంపీ కేశినేని శివనాథ్‌కి వివరించారు. శ్రామికులకి, కార్మికులకి, బడుగు బలహీన వర్గాలకు సీఎం చంద్రబాబు, టీడీపీ అండగా ఉంటుందని ఎంపీ కేశి నేని శివనాథ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెంటపల్లి శ్యామ్, ప్రధాన కార్యదర్శి ఆదిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూతక్కి రాము, కోశాధికారి ఆకుల సూర్యప్రకాష్, జిల్లా అధ్యక్షుడు సుంకర విష్ణు కుమార్, తూర్పునియోజకవర్గ టీఎన్టీయూసీ అధ్యక్షుడు రామవరపు అశోక్, సీనియర్ నాయకులు దాసరి కనకరావులతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే సమాజ సేవ అలవర్చుకోవాలి

### ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు మంజునాథ్




**అనంతపురం, ఏప్రిల్ 24 (జనస్వరం) :** ఎన్ఎస్‌యూఐ విద్యార్థి విభాగం జిల్లా నాయకులు మంజునాథ్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం నగరంలో ఉన్నటువంటి సురక్ష సేవా సమాజ్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు మంజునాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక సేవకు అంకితమైన సేవా కార్యక్రమాలలో చురుకుగ్గా పాల్గొని పేదలకు అండగా నిల్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అదేవిధంగా ఎన్ఎస్‌యూఐ మంజునాథ్ పుట్టినరోజు సందర్భంగా నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు బ్రెడ్లు అరటి పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించినందుకు సంతోషం వ్యక్తంగా ఉందన్నారు. పేదల సేవలోని తమకు నిజమైన సంతృప్తిగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. పుట్టినరోజు ఇతర వేడుకల సందర్భంగా ఆడంబరాలకు అనవసరమైన ఖర్చులు చేయకుండా ఆ డబ్బు పది మందికి పనికి వచ్చే కార్యక్రమాలు చేపట్టాలని వారు సూచించారు. సమాజంలో పేదలకు తమ వంతు సహాయ సహకారం అందిస్తే వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. యువత విద్య, ఉద్యోగాలలో రాణిస్తూ కొంత సమయాన్ని సామాజిక సేవ కార్యక్రమాలకు కేటాయించాలన్నారు. ప్రతి ఒక్కరూ సన్మార్గం లోననడుస్తూ పట్టుదలతో ముందుకు వెళ్లి అనుకున్న ఆశయాలను సాధించాలన్నారు. అదేవిధంగా కష్టాలో ఉన్నవారికి తమ వంతు సహకారాలు అందిస్తాం అదేవిధంగా సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఉండాలని, తద్వారా మానవతా విలువలు పేరిగే అవకాశం ఉందన్నారు. వృద్ధులకు నా నుంచి చిన్న సేవ కార్య క్రమం చేయడం ఎంతో సంపృత్తిగా ఉందన్నారు. విద్యార్థి దశ నుంచి విద్యార్థులకు సేవా భావం అలవాటు చేస్తూ, చదువుతో పాటుగా సామాజిక స్థితిగతులను పరిచయం చేయాలన్నారు. తద్వారా సామాజిక స్రుహ, దేశం పట్ల నిబద్ధత, తమది అనుకొనే వస్తువును అవసరం ఉన్నవారికి ఇద్దామనే మంచి వ్యక్తిత్వం అలవడుతుందన్నారు. ప్రతి ఒక్క యువత అన్ని రంగాల్లో ముందు ఉన్నారని, వారి తల్లిదండ్రులు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా నిరంతరం ప్రోత్సహిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. యువత సామాజిక సేవలో భాగస్వాములు కావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో భైరవ, మనోహర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.


# దేశాభివృద్ధి చూసి ఓర్వలేక పాకిస్థాన్ ఈ దాడిని ప్రోత్సహించింది

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- మిల్క్ ప్రాజెక్ట్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా మానవహారం




**విజయవాడ, ఏప్రిల్ 24 (జనస్వరం) :** దేశ ప్రజలందరూ ఐక్యంగా వుండటం, దేశాభివృద్ధి చూసి ఓర్వలేక ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పక్కదేశమైన పాకిస్తాన్ సహకారంతో పహల్గాంలో ఉగ్రవాదులు టూరిస్టులపై దాడికి పాల్పడ్డారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కృష్ణాజిల్లా మిల్క్ యూనియన్ (విజయ) చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం మిల్క్ ఫ్యాక్టరీలో పహల్గాంలో ఉగ్రవాదులు టూరిస్టులపై జరిపిన దాడిని ఖండిస్తూ, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మానవహారం నిర్వహించారు. ఈ మానవహారం కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొని ఉగ్రవాదుల దాడిని ఖండించారు. ఉగ్రవాదం నశించాలి.. దోషులను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ ఆధ్వర్యంలోనే ఈ దాడి జరిగిందని భారతదేశం గట్టిగా విశ్వసిస్తుందన్నారు. ఈ ఉగ్రదాడిలో అమాయకులు చనిపోవడం దేశ ప్రజలందర్నీ కలిచివేసిందన్నారు. కులమతాలకు అతీతంగా దేశ ప్రజలందరితో పాటు కాశ్మీర్ ప్రాంత ప్రజలు కూడా శాంతినే కోరుకుంటూ ఈ దాడిని ఖండించారని తెలిపారు. ఇలాంటి దాడుల చేసి దేశ ప్రజల ఐక్యతను విచ్ఛనం చేయలేరని తెలిపారు. సైనిక దుస్తుల్లో వచ్చి ఇలాంటి దాడులకి పాల్పడిన దోషులను త్వరలోనే పట్టుకుని కేంద్రం ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం భద్రతపరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఉగ్రవాదుల దాడుల మృతి చెందిన మృతుల కుటుంబాలకు దేశ ప్రజలందరూ అండగా వుంటారని తెలిపారు. ఈ ఉగ్రవాదుల దాడిలో గాయపడిన వారికి సానుభూతి తెలుపుతూ, మృతి చెందిన వారికి సంతాపం తెలియపర్చారు. మృతి చెందిన వారిపవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. అనంతరం కృష్ణాజిల్లా మిల్క్ యూనియన్ (విజయ) చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ కాశ్మీర్ ప్రాంతంలో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించేలా దాడికి తెగబడిన ఉగ్రవాదుల పట్ల కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించబోదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి ఫతావుల్లాహ్, రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు ఆషా, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సొలంకి రాజు, పశ్చిమనియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు సుఖాసి సరిత, పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, పశ్చిమ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు నమ్మి భాను ప్రకాష్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు గుర్రం కొండ, క్లస్టర్ ఇన్చార్జ్‌లు యేదుపాటి రామయ్య, సుఖాసి కిరణ్, భవానీ ప్రసాద్, సుబ్బారెడ్డి, లోకేష్, డివిజన్ అధ్యక్షులు నాగోతి రామారావు, గంగాధర్ రెడ్డి, బుదాలి నందకుమారి, పీతాని పద్మ, చిన్న సుబ్బయ్య, ఈశ్వర్, రేగళ్ల లక్ష్మణరావు, ముదిరాజు శివాజీ, కునికికొండయ్య, సలీమ్, టీడీపీ నాయకులు శివశర్మ, తిరుమలేష, గంగవరపు మురళీ, ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర్ బాబుతో పాటు మిల్క్ ప్యాక్టరీ బోర్డ్ మెంబర్స్, ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

# గిన్నిస్ రికార్డు సాధించిన కూచిపూడి బాల నర్తకులకు ఘన సత్కారం



**మంగళగిరి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** హైదరాబాద్‌లో భారత్ ఆర్ట్స్ అకాడమీ వారు ఘనంగా నిర్వహించిన "కూచిపూడి కళా వైభవం" కార్యక్రమంలో భాగంగా గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిన మంగళగిరికి చెందిన శ్రీ నటరాజ నృత్యాలయం శిష్యులు అత్యంత గౌరవప్రదమైన గుర్తింపు పొందారు. ఈ బాల నర్తకులు నాట్యాచారిణి కుమారి బట్టు తిరుమల కళ్యాణి మార్గదర్శకంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతూ ప్రపంచస్థాయిలో ప్రతిభను చాటారు. ఈ గౌరవాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు వీరిని హృదయపూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ చిన్నారులు సాధించిన ఘనత ప్రతి భారతీయునికి గర్వకారణం. కేవలం నృత్య ప్రదర్శన మాత్రమే కాదు, మన సంస్కృతి, గురుపరంపర, అంకితభావాన్ని ప్రపంచానికి చాటే ప్రయత్నం ఇది. ఈ చిన్నారులు అంతర్జాతీయ వేదికపై భారతీయ నాట్యకళను ప్రతినిధ్యం వహించగలిగారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి దేశ గౌరవాన్ని మరింత పెంచుతారని ఆశిస్తున్నాను" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ గిన్నిస్ రికార్డు ఘనతతో తెలుగు ప్రాంతాల కళా వారసత్వానికి మరొక విశిష్ట గుర్తింపు లభించినట్లు నాట్య ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కాశ్మీర్లో ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



**నెల్లూరు, ఏప్రిల్ 23 (జనస్వరం) :** పెహల్గాంలో అమాయకులైన 27 మందిని పొట్టన పెట్టుకుని, హతమార్చిన సంఘటనలో ఉగ్రవాద, తీవ్రవాద చర్యలను ఖండిస్తూ సిటీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరులోని గాంధీ బొమ్మ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినట్లు సిటీ ఉపాధ్యక్షులు కే.సంజయ్ కుమార్, జనరల్ సెక్రెటరీ సుధీర్ తెలిపారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ తీవ్రవాదం ఏ రూపంలో ఉన్న కూకటి వేళ్ళతో పెకలించాలని, మత తత్వం, తీవ్రవాదం రెచ్చగొట్టే విధానాలు వల్ల దేశం ప్రాంత, కుల, మత, విభజనలకు కారణమవుతాయని, దేశ సమగ్రతకు ఐక్యతకు సార్వభౌమాధికారానికి భంగం కలిగితే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, పాక్ ప్రేరేపిత తీవ్రవాదాన్ని పూర్తిగా అణిచివేయాలని కోరారు. రెండు నెలలుగా పాక్ మంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు భారత్‌పై చేస్తున్నా ఇంటెలిజెన్స్ అప్రమత్తం కాలేకపోయిందని దీనివల్ల అమాయకులు బలైనారని, హత్యకు గురైన కుటుంబాలను, క్షతగాత్రులైన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సుదీర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇర్ఫాన్, పార్టీ సీనియర్ నాయకుడు అల్లావుద్దీన్, కాంగ్రెస్ రూరల్ ఇంచార్జ్ మల్లికార్జున్ రెడ్డి, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు రెహమాన్, ధనుంజయ్, సేవాదళ్ సుజాత, నెహెమ్యా, బక్షు, నదీమ్, ముస్తాక్, వెంకటేశ్వర్ల రెడ్డి, హనీఫ్, అమీర్, లక్ష్మి, చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడిని నిరసిస్తూ ఉదయగిరిలో జనసేన మౌన దీక్ష



**నెల్లూరు, ఏప్రిల్ 24 (జనస్వరం) :** పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ, ఈ దుశ్చర్యలో మృతి చెందిన వారికి సంతాప సూచకంగా ఉదయగిరిలోని బస్టాండ్ సెంటర్ వద్ద నియోజకవర్గ పీఓసీ కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, మండల అధ్యక్షులు కల్లూరు సురేంద్ర రెడ్డి అధ్యక్షతన జనసేన పార్టీ మౌన దీక్ష చేపట్టింది. ఇందులో భాగంగా ఉదయగిరి నియోజకవర్గం పీఓసీ కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు మూడు రోజులు సంతాప దినాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఉదయగిరి పట్టణంలో తీవ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేస్తూ మౌన దీక్ష చేపట్టడం చేపట్టినట్లు తెలిపారు. కాశ్మీర్‌లో పర్యాటకులను, ముష్కరులు కాల్చి చంపటం దారుణమని, మృతులకు, ఆత్మ శాంతి కలగాలని కోరుతూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దేశంలో ఉగ్రవాదులను అణచివేయాల్సిన అవసరం ఉందని, పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం అత్యంత హేయమైన చర్య అని వాఖ్యానించారు. వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉగ్రవాదుల చర్యలను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉగ్రవాదులను సమూలంగా, అణచివేయాల్సిన అవసరం ఉందని, కేంద్ర ప్రభుత్వం, కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మృతుల్లో కావలి వాస్తవ్యుడు జన సైనికుడు సోమిశెట్టి మధుసూదనరావు, ఉండటం, అత్యంత బాధాకరమైన విషయమని తెలిపారు. వారికి సంతాపం తెలియజేస్తూ వారు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ పీఓసీ కొట్టే వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ఆల్లూరి రవీంద్ర, ఉదయగిరి మండల అధ్యక్షులు కల్లూరి సురేంద్ర రెడ్డి, రాయలసీమ జోన్ కమిటీ సభ్యులు కమతం శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షులు బయన్న, బీజేపీ నాయకులు రోశయ్య, వెంకటేశ్వర్లు, దుత్తలూరు మండల అధ్యక్షులు రవి కుమార్, వింజమూరు అధ్యక్షులు బండారు సత్యనారాయణ, వరికుంటపాడు మండల అధ్యక్షుడు రసూల్ పటాన్, కలిగిరి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఉదయగిరి మండల సీనియర్ నాయకులు కుర్ర కృష్ణ యాదవ్, ఉదయగిరి పట్టణ నాయకులు నాకెళ్ళ రవి, ఉదయగిరి మండల ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, జనసైనికులు గువ్వల వెంకీ, లిఖిత్, వెంకట ప్రసాద్, 8 మండలాల కూటమి నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## జమ్మూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడిని ఖండించండి : సీపీఎం




**విఆర్ పురం, ఏప్రిల్ 24 (జనస్వరం) :** పహెల్గాంలో జరిగినటువంటి ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామంటూ సీపీఎం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ ఉద్ఘటించారు. గురువారం రేకపల్లి ప్రధాన రహదారి కూడలిలో జమ్మూ కాశ్మీర్లో జరిగినటువంటి ఉగ్ర దాడిని నిరసిస్తూ అక్కడ వీరమరణం పొందినటువంటి వారికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ లోని పర్యాటక అందాలను ఆస్వాదించడానికి వచ్చినటువంటి అమాయక పర్యాటకులపై ముష్కరులు దాడి చేయడం పిరికిపంద చర్య అని, అమాయకుల ప్రాణాలు బలి కొనడం సరైనది కాదని, ఉగ్రవాదులపై భారత ప్రభుత్వం తప్పకుండా ఉక్కు పాదం మోపుతుందని, ఆ ఉగ్రవాద కాల్పుల్లో మరణించిన కుటుంబాలకు తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని, మరణించిన కుటుంబ సభ్యులు కుటుంబానికి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. మరల ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ కారం లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామ్ మూర్తి, పంక్కు సత్తిబాబు గుండుపూడి లక్ష్మణరావు, కారం సుందరయ్య, చీరపు తాతబాబు, పీసాపద్యక్ష, కార్యదర్శి వెటకాని.సూరి, సారా.పాండురాజు, కమ్మసిచ్చి సత్యనారాయణ, పంకు చందు, ఆత్మకూరి కాంతారావు, వీర్ల నాగేశ్వరరావు, నాళ్ళారపు.ప్రకాశరావు, గూటాల శివ, కుంజా కన్నయ్య, సోడే మల్లయ్య, అజరత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాల పెంపునకు నూతన కోర్సుల ప్రవేశాలు


### రాయలసీమ, యోగివేమన యూనివర్సిటీ అధికారులతో గవర్నింగ్ బాడీ సమావేశం




**నంద్యాల, ఏప్రిల్ 24 (జనస్వరం) :** విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన కోర్సులలో విద్యా ప్రమాణాలు పెంపునకు ఏ విధమైనటువంటి పరిశోధనలు అభ్యాసం శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని రాయలసీమ యూనివర్సిటీ తెలుగు విభాగ అధిపతి ప్రొఫెసర్ నరసింహులు యోగివేమన యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగ పద్ధతి ప్రొఫెసర్ కృష్ణారెడ్డిలో పేర్కొన్నారు. గురువారం శ్రీ రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా విధానంలో విద్యార్థులకు రాబోయే రోజుల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభించాలంటే పరిశ్రమల పైనను విద్యార్థులకు అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాలలో మంచి అదునాతనమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గవర్నమెంట్ బాడీ సభ్యులు ఇచ్చినటువంటి సూచనలను విద్యార్థులు అవగాహన చేసుకున్నారు. ప్రతి కళాశాలలోనూ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ప్రాధాన్యతలను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు ఇచ్చేటువంటి సలహాలు సూచనలు పాటించి విద్యార్థులు అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధ్యాపకులు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ వి. విజయ్ కుమారి డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి, డీన్ అఫ్ స్టూడెంట్ అఫైర్స్ అధికారి ప్రగతి రెడ్డి, కళాశాల పరీక్షల నిర్వహణ అధికారి కేబివి సుబ్బయ్య,కంప్యూటర్ విభాగ ప్రతిపది యువిఎస్ కుమార్, వెంకట్రావు, సహదేవరెడ్డి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

# రణమా.. శరణమా పల్లా తేల్చుకోవాలి

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా ను ఉద్దేశించి తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్
- కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా, సీబీఐ డైరెక్టర్‌కు తెలుగు శక్తి ఫిర్యాదు
- పల్లా అనుచరుడి ఆరోపణలపైనా, పల్లా శ్రీనివాసరావుపైనా సీబీఐ చేత విచారణ చేయాలని విజ్ఞప్తి
- ఇప్పటికే పల్లాపై గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు




**ఢిల్లీ, ఏప్రిల్ 24 (జనస్వరం) :** తనతో రణమో.. శరణమో తేల్చుకోవాలని టీడీపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌ను ఉద్దేశించి.. తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ సవాల్ చేశారు. ఇదే విషయమై దేశ రాజధాని ఢిల్లీలో గురువారం మధ్యాహ్నం మీడియాతో ఆయన మాట్లాడారు. తన వ్యక్తిగత జీవితానికి భంగం కలిగించే విధంగా పల్లా అనుచరుడు ప్రసాదుల ఒక ప్రకటన విడుదల చేశారన్నారు. బి.వి.రామ్ ఒక లుచ్చా, బ్లాక్ మైలర్, తెలుగు శక్తికి అధ్యక్షుడు కాదు తెలుగు బ్రోకర్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. పల్లా అనుచరుడు చేసిన ఆరోపణలు నిజమో కాదో తెలియాలంటే.. పల్లా శ్రీనివాసరావు పైనా సీబీఐ చేత విచారణ జరిపించాలని.. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా, సీబీఐ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. అంతే కాకుండా తనకు పల్లా నుంచి ప్రాణ హాని ఉందని, తనకు తగిన రక్షణ కల్పించాలని కేంద్రం హెూం మంత్రిని కోరామని తెలిపారు.

**దశాబ్దాల నుంచి రాజకీయ అనుభవం :**
తన కుటుంబానికి దశాబ్దాల నుంచి రాజకీయ అనుభవం ఉందని, వాజ్‌పేయి ప్రభుత్వంలో తన పెదనాన్న కేంద్ర వ్యవసాయ మంత్రిగా పని చేసారన్నారు. అయినప్పటికీ తాను ఏనాడు పదవుల కోసం పాకులాడలేదని.. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పోరాటం చేస్తున్నానని పేర్కొన్నారు. ఇదే క్రమంలో గత వైసీపీ అరాచక పాలనపై పోరాటం చేశానని తెలిపారు.

**పల్లా అక్రమాలపై ఒక ఫైల్ సిద్ధంగా ఉంది :**
చంద్రబాబు జన్మదిన వేడుకలను విశాఖలోని హెూటల్ దశపల్లాలో ఘనంగా నిర్వహించానన్నారు. అయితే ఆ వేడుకలకు హాజరు కాకుండా అనేక మందిని పల్లా అడ్డుకున్నారని ఆరోపించారు. వచ్చిన వారిని పల్లా అనుచరులు బెదిరిస్తున్నారని రామ్ ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు చంద్రబాబును తాను కలవకుండా పల్లా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు పీఏ రాజగోపాల్, పీఎస్ కపర్థి తన ఫోన్ నెంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారన్నారు. చంద్రబాబును తాను చివరి సారిగా గత ఏడాది అక్టోబర్ 10న కేంద్ర మంత్రి పియూష్ గోయల్ కార్యాలయంలో చివరిసారిగా.. కలిశానని తెలిపారు. అప్పుడు కూడా వ్యక్తి గత సిబ్బంది ఆటంకాలు సృష్టించారన్నారు. ఇప్పుడు వారిద్దరికీ పల్లా శ్రీనివాస్ తోడై.. చంద్రబాబును తనను కలవకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈలోగా తన కోసం చంద్రబాబు వద్ద తప్పుగా చెప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఏది ఏమైనా తాను ఒక్కసారి చంద్రబాబును కలిస్తే పల్లా శ్రీనివాస్ అక్రమాల చిట్టాకు సంబంధించిన ఫైల్‌ను అందజేస్తామని పేర్కొన్నారు.

## గడపరాయిలో గణజీవామృతం సామూహిక తయారీ

- ప్రకృతి సేద్యం అభివృద్ధికి రైతుల కృషి
- మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్






**చింతపల్లి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** ప్రకృతి సేద్యం ప్రోత్సాహానికి మండలంలోని గడపరాయి గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసు ఆధ్వర్యంలో గణజీవామృతం సామూహిక తయారీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 20 మంది ఉత్తమ రైతులు ఒకేరోజు 100 కిలోల గణజీవామృతాన్ని సిద్ధం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు గణజీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానం, అవసరమైన పదార్థాలు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించబడింది. ప్రకృతి సేద్యంలో గణజీవామృతం వాడకం పంటల ఆరోగ్యానికి, నేలపాలీల పెంపుదలకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. రాబోయే 2025–26 ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి రైతు తప్పనిసరిగా నవధాన్యాల సాగు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం ఇతర గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలిచేలా ప్రోత్సహించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ జె. వెంకటరమణ, యూనిట్ ఇంచార్జ్ కొర్ర మోహన్ రావు, ఐసీఆర్పీలు గడుతూరి బొజ్జి పడాల్, కోరాబు రాజేశ్వరి పాల్గొన్నారు.


## జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడిని ఖండిస్తూ అనంతపురంలో జనసేన మౌన దీక్ష

- మృతులకు నివాళులర్పించిన జనసైనికులు
- మున్సిపాలిటీ ఆఫీసు వద్ద ఘనంగా కార్యక్రమం



**అనంతపురం, ఏప్రిల్ 24 (జనస్వరం) :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ఉగ్రవాదులు జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దాడిలో అమరులైన వారికి సంతాప సూచకంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో అనంతపురంలో మౌన దీక్ష చేపట్టింది. గురువారం ఉదయం అనంతపురం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని అమరుల స్మృతికి మౌనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన ఉపాధ్యక్షులు లాయర్ కుంటిమద్ది జయరాం రెడ్డి, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, రాష్ట్ర కార్యక్రమాల ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, రాయలసీమ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, జిల్లా కార్యదర్శులు సంజీవ రాయుడు, కిరణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు జయమ్మ, అవుకు విజయ కుమార్, నగర ఉపాధ్యక్షుడు జక్కి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, హిమామ్ హుస్సేన్, పెండ్యాల చక్రపాణి, నగర కార్యదర్శులు విశ్వనాథ్, లాల్ స్వామి, కుమ్మర మురళి, సంపత్, నగర సహాయ కార్యదర్శులు నెట్టికంటి హరీష్, ఆకుల ప్రసాద్, వీరితోపాటు, వీర మహిళలు అయిన అనసూయ, దాసరి సరిత, శైలజ, పార్వతి, ఇతర నాయకులు చిరు, ఎంవీ.శ్రీనివాస్, వెంకట సాయి, హిద్దూ, ఆరేటి వంశీ, హరికృష్ణ, నాగరాజు, రమణ, ప్రసాద్, హరి, వంశీ, చిన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు, ఉగ్రవాదాన్ని ఖండిస్తూ, దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. "దేశ భద్రతకు మారణాయుధాల కంటే మౌన దీక్షలతో ప్రజల ఐక్యతే అగ్రశ్రేణిలో నిలుస్తుంది" అని వారు పేర్కొన్నారు.

## పులివెందులలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ



**పులివెందుల ఏప్రిల్ 24 (జనస్వరం) :** పట్టణంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పులివెందులకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి, శివతో పాటు సుమారు 20 మంది గురువారం బీజేపీలో చేరారు. స్వచ్ఛందంగా పార్టీలో చేరిన వారిని జిల్లా అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి, ఏపీ మార్క్ఫెడ్ డైరెక్టర్ శశి భూషణ్ రెడ్డిలు సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు వివరించారు. అలాగే తిరుపాల్ రెడ్డి, శివలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఎంత కష్టపడినా ఫలితం లేదన్నారు. విశ్వసనీయత లేని పార్టీలో ఉండకూడదని నిర్ణయించుకుని బీజేపీలో చేరామన్నారు. బీజేపీ పటిష్టతకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భాను ప్రకాష్, మహేశ్వర్ రెడ్డి, గాలి హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గుణదలలో బీజేపీకి బలమైన ఆమోదం


### డజన్ల కొద్దీ వైసీపీ కార్యకర్తల బీజేపీలో చేరిక



**విజయవాడ, ఏప్రిల్ 24 (జనస్వరం) :** స్థానిక తూర్పు నియోజకవర్గంలోని గుణదల మండలం 5వ డివిజన్‌లో బీజేపీకి భారీ ఊతం లభించింది. వైసీపీకి చెందిన పలువురు కార్యకర్తలు, నేతలు డజన్ల సంఖ్యలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, పార్టీలో చేరిన వారికి బీజేపీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ చేరికలు డాక్టర్ కాకాని తరుణ్ నాయకత్వంలో జరిగాయి. పార్టీలో చేరిన పురుషోత్తం, తన అనుచరులతో కలసి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ "తనను పార్టీలో చేర్చుకుని ప్రోత్సహించిన జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్‌కి, తూర్పు నాయకుడు డాక్టర్ కాకాని తరుణ్‌కి, గుణదల మండల అధ్యక్షుడు ఎన్.పవన్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. గుణదల మండలంలో బీజేపీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తాను," అని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ "బీజేపీ నైతిక విలువలు, దేశభక్తిని ప్రాతినిధ్యం వహించే పార్టీ. పార్టీ సూత్రాలను అనుసరిస్తూ, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బీజేపీని బలోపేతం చేయాలన్నదే మన లక్ష్యం" అని అన్నారు. ఈ చేరికలతో గుణదల మండలంలో బీజేపీకి పెద్ద ఊతం లభించినట్లు స్థానిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. డాక్టర్ కాకాని తరుణ్ నాయకత్వంలో మరోసారి తూర్పు నియోజకవర్గం రాజకీయంగా చురుకుదనాన్ని చాటుకుంది.


## మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్ధశ

- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు
- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, ఏప్రిల్ 24 (జనస్వరం) :** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్ధశ పట్టిందని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ అన్నారు. భవిష్యత్తులో కోవూరు నియోజకవర్గం నుంచి రాష్ట్రస్థాయిలో తొలి ర్యాంకు సాధించేలా చూడాలన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కోవూరు ఎమ్మెల్యే మతి వేమిరెడ్డి ప్రశాంతమ్మ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విపిఆర్ నివాసంలో ఎమ్మెల్యేను కలిసిన విద్యార్థులు.. ఆమె ఆశీస్సులు అందుకున్నారు. అలాగే ఇందుకూరుపేట మండలంలో 593 మార్కులతో తొలిస్థానం సాధించిన గుడి భార్గవ్ అనే విద్యార్థికి టీడీపీ నాయకులు దాసరి విజయ్ తన భార్య జ్ఞాపకార్థం 25 వేల నగదు బహుమతిని ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు. అలాగే మండలానికి చెందిన టిడిపి నాయకులు సతీష్.. 591 మార్కులు సాధించిన నేహా ఫర్హాత్‌కు సిగమాల పుల్లమ్మ జ్ఞాపకార్థం 10 వేల పురస్కారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించి ప్రోత్సహించారు. ఇక అమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరుపునఎమ్మెల్యే చేతుల మీదుగా 586 మార్కులు వచ్చిన నెల్లూరు హారికకు ట్రస్ట్ వ్యవస్థాపకులు దొడ్ల మల్లికార్జున్ 5 వేల రూపాయలు బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించి పురస్కారాలు అందించడం గొప్ప విషయమన్నారు. ఇంతబాగా చదువు చెబుతున్నందుకు ఉపాధ్యాయులకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ట్రిపుల్ ఐటీల్లో సీటు సాధించేలా విద్యార్థులను గైడ్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం టిడిపి నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. జిల్లా స్థాయిలో ఇందుకూరుపేట మండలానికి మంచి గుర్తింపు తీసుకువచ్చిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇలాగే విజయపరంపరను కొనసాగించాలని సూచించారు. విద్యార్థుల అభివృద్ధికి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే దానికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు.

## అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి యూటీఎఫ్ ఆర్థిక సాయం



**విఆర్ పురం, ఏప్రిల్ 24 (జనస్వరం) :** చొక్కనపల్లి గ్రామంలో ఏప్రిల్ 20న జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా తోడం రాంబాబు ఇల్లు పూర్తిగా కాలిపోగా, ఇంటిలో ఉన్న అన్ని వస్తువులు నాశనం కావడంతో వారు తీవ్రంగా నష్టపోయారు. పూర్తిగా నిరాశ్రయులుగా మిగిలిన ఆ కుటుంబానికి యూటీఎఫ్ మండల కమిటీ పరమార్థంగా ముందుకు వచ్చి ఆర్థిక, నిత్యావసర సాయం అందించారు. ఈ సహాయాన్ని స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు సున్నం రాజులు, మండల కమిటీ సభ్యులు పూసం రామారావుల ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. బియ్యం, నిత్యావసర వస్తువులు, గిన్నెలు, రూ.2000 నగదు సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమం యుటిఎఫ్ మండల ఉపాధ్యాయుల సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా తోడం రాంబాబు కుటుంబ సభ్యులు, తమపై చూపిన మానవతా దృక్పథానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎన్. జగదీష్, కార్యదర్శులు ఎన్. రామకృష్ణ, ఎం. బాబు, జె. వెంకటరెడ్డి, గ్రామస్తులు తోడం రాజు పాల్గొన్నారు.

# ఉక్కు కార్మికులకు అండగా ఉంటా

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- కూర్మన్నపాలెంలో దీక్షల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం



**కూర్మన్నపాలెం, ఏప్రిల్ 24 (జనస్వరం) :** ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1,533 రోజులుగా కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సందర్శించి, సంఘీభావం తెలిపారు. ప్రస్తుతం ఉక్కు కర్మాగార పరిస్థితి, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు, గత ఎనిమిది నెలలుగా అరకొర జీతాల చెల్లింపు తదితర వివరాలను ఆమెకు పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్ వివరించారు. ప్యాకేజీ వల్ల కర్మాగారానికి, కార్మికులకు ఒరిగేదేమీ లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, తన తాబేదార్లకు కట్టబెట్టాలని మోదీ చూస్తున్నారని ఆరోపించారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చేపట్టిన ఉద్యమానికి సంపూర్ణ సహకారం అందించాలని షర్మిలను అభ్యర్థించారు. ఉక్కు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అందుకు ఆమె స్పందిస్తూ కార్మికులకు అండగా ఉంటానని, మరోమారు వచ్చి దీక్షలలో కూర్చుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, దొమ్మేటి అప్పారావు, వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, పలువురు ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

## జగన్ దొంగని చెబుతున్నది వారే

**మంత్రి సంధ్యారాణి**



**సాలూరు/పాచిపెంట, ఏప్రిల్ 24 (జనస్వరం) :** మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దొంగ అని ఏ2 నిందితుడు విజయసాయి రెడ్డే చెబుతున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పాచిపెంట మండలంలోని మిర్తివలస, కొత్తవలస గ్రామాల్లో ఆమె గురువారం పర్యటించారు. అనంతరం సమీపంలో ఉన్న పామాయిల్ తోటలో మండలానికి చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తప్పులు చేసినవారు విజయవాడ, హైదరాబాద్ ఆసుపత్రుల్లో చేరి వైద్యం చేయించుకుంటున్నారని... కొంతమంది రాష్ట్రం విడిచి వెళ్లి పోయారని ఎద్దేవా చేశారు. ఎన్నో తప్పులు చేసిన ఐపీఎస్ అధికారి సీతారామంజనేయులును న్యాయస్థానం విడిచిపెట్టడం లేదని అన్నారు. రోజాతో పాటు వైసీపీ నాయకులు 'ఆడుదాం ఆంధ్ర'లో భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. జీవో నెం.3ను చంపేసింది వైసీపీ ప్రభుత్వమేనని అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి యుగంధర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు, మాదిరెడ్డి తులసిరామ్, తొత్తల సత్యవతి, కొరిపిల్లి సురేష్, ఎంపీటీసీ ఉమా తదితరులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణాను అడ్డుకుందాం

**ఆర్డీవో రామ్మోహనరావు**



**బొబ్బిలి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరి?ధిలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తు తున్నాయని, అధికార యంత్రాంగమంతా కలిసికట్టుగా దీనికి అడ్డుకట్ట వేయాలని ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన జంతు సంక్షేమ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దత్తిరాజేరు మండలం పెద మానాపురంలో పశువుల సంత నిర్వహణకు లైసెన్స్ లేకపోయినప్పటికీ అక్కడ పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దేవాలయాలకు మూడు వందల మీటర్ల పరిధిలో ఎటువంటి జంతు బలులు జరగకుండా చూడాలని సూచించారు. వచ్చే నెల మొదటి వారంలో గొల్లపల్లి దాడితల్లి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో అక్కడ జంతు బలులు నిషేధం అన్న బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొబ్బిలి డీఎస్పీ జి.భవ్య మాట్లాడుతూ పెదమానాపురం సంతకు ఒడిశా, పార్వతీపురం, పి.కోనవలస మీదుగా పశువుల అక్రమ రవాణా జరగకుండా తగిన నిఘా పెడతామని తెలిపారు. ఏపీ గోసంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ బొబ్బిలి డివిజన్‌లో పశువుల అక్రమ రవాణా చాలా జోరుగా జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిని అడ్డుకుని, రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేయాలన్నారు. గో సంర క్షణా శాలల ఏర్పాటు కోసం స్థలాలను కేటాయించాలని కోరారు. అనంతరం గోమాత గోసంరక్షణ సంస్థ రూపొందించిన క్యాలెండర్లను ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పశు సంవర్థక శాఖ డీడీ ఎల్.విష్ణు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య, మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు ఉప్పాడ సోమేశ్వరరావు, మండల పరిషత్ ఏవో ఆర్‌వీఏ రావు, దత్తిరాజేరు మండల పంచాయతీ విస్తరణాధికారి వాణిశ్రీ, గోసంరక్షణ ప్రతినిధులు కేవీఆర్ సత్యనారాయణ, చింతలపూడి భూపతి, వి.ఝాన్సీ పాల్గొన్నారు.

## పహల్గాం 'ఉగ్ర'దాడితో తిరుపతి, తిరుమలలో హైఅలర్ట్

**ఘాట్లలో ముమ్మరంగా కూంబింగ్**

**తిరుపతి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పోలీసులు, టీటీడీ విజిలెన్సు అప్రమత్తమైంది. తిరుపతి, తిరుమలలో భద్రత కట్టుదిట్టం చేశారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, విష్ణునివాసం, మాధవం, అన్ని ఆలయాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుమానం ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు కట్టుదిట్టం చేశారు. తిరుపతిలోని అన్ని రోడ్లు, ముఖ్య కూడళ్లలో బాంబు, డాగ్ స్క్వాడ్లు తనిఖీలు చేస్తున్నాయి. ఇప్పటికే బాంబు నిర్వీర్యం చేసే దళాలు రంగంలోకి దిగి లాడ్జీలు, కొన్ని భవనాలు పరిశీలిస్తున్నారు. ఆలయాల వద్ద భద్రత పెంచారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇలాంటి తనిఖీలు మరో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు చెప్పారు. తిరుపతి, తిరుమలలో మొత్తం 75 ప్రాంతాల్లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇక, అలిపిరి చెక్ పాయింట్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. రెండు ఘాట్ రోడ్లలో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఘాట్‌లోని లింకు రోడ్డులో ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేసి పంపుతున్నారు. టీటీడీ సీవీఎసవో ఎఫ్ఏసీ హోదాలో ఎస్పీ హర్షవర్ధనరాజు తిరుమల భద్రతపై అన్ని శాఖల అధికారులతో సమీక్షించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# ప్రేమ.. ఉద్యోగాల.. పేరుతో టోకరా...!?

- రూ.4 కోట్లు వసూళ్లు చేసిన మోసగాడు
- దొంగ ప్రేమికుడి బాధ్యతలెందరో?
- ఉద్యోగాలు ఇపిస్తానని మోసాలు
- ప్రేమ పేరుతో వంచించి వసూళ్లు
- బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు

**పత్తికొండ, ఏప్రిల్ 24 (జనస్వరం) :** నేటి సభ్య సమాజంలో నిజమైన ప్రేయసి ప్రేమికులు మచ్చుకు కొందరు మాత్రమే కనిపిస్తుంది. అమ్మాయిలు కులం, వర్ణం, వర్గం వంటి భేదాలను మరిచి నిజంగా ప్రేమిస్తున్నాను. ప్రేమను అలుసుగా తీసుకొని కొందరు మోసగాళ్లు ప్రేమ పేరుతో వంచించి,మహిళలు లొంగదీసుకుని వాళ్ల శీలమానాలను దోచుకుంటున్నారు. ఆసమయాలలో అమ్మాయిలకు తెలియకుండా ఫోటోలు, వీడియోలు తీసి వాటితో బ్లాక్ మెయిల్ చేసి లక్షలు లాగుతున్నారు.ఇలా చాలామందితో ప్రేమ వ్యవహారం జరిపి ఓ వంచకుడు ఏకంగా నాలుగు కోట్ల రూపాయలు వసూళ్లు చేశాడు. పత్తికొండ నియోజకవర్గం పగడరాయి పంచాయతీ పరిధిలో గ్రామానికి చెందిన అగ్రవర్ణ యువకుడు కర్నూలు విద్యాభ్యాసం చేశాడు. ఆ సమయంలో ఓ బీసీ కులానికి చెందిన అమ్మాయితో ప్రేమ వ్యవహారం నడిపాడు. ఆ ప్రేమను కాస్త కామంగా మార్చాడు. అమ్మాయిని వల్లో వేసుకున్న తర్వాత మాయ మాటలు చెప్పి ఆమె శీలాన్ని సమయంలో ఆమెకు తెలియకుండా తీసిన వీడియోలు, ఫోటోలు తన దగ్గర దాచుకున్నాడు. ఇలా కొద్ది రోజులు అమ్మాయితో రాసలీలలు ఆడాడు.ఆ తర్వాత అమ్మాయి బోర్ కొట్టింది.ఆమెపై లేనిపోని అపనిందలు మోపాడు. వేరే ముస్లిం కుర్రాడిని ప్రేమిస్తున్నావని బ్లాక్ మెయిల్ చేశాడు. తనకు ఇక నీవు అవసరం లేదని బెదిరించాడు. తాము అమ్మాయిని వదులుకుంటునట్లు చెప్పాడు. అందుకు ఆ అమ్మాయి వద్ద చీటికిమాటికి ఫోన్ చేసి లక్షల రూపాయలు వసూలు చేశాడు. వసూలు చేసిన సొమ్ముతో జల్సాలు చేశాడు. అదే సమయంలో వేరే అమ్మాయిలతో ప్రేమ వ్యవహారాలు నడిపాడు. వారిని కూడా ప్రేమిస్తున్నట్లు నటించి వంచించాడు. వారికి ఏమీ మాయ చేశాడు.వల్లో వేసుకున్న తర్వాత వాళ్ల శీలాన్ని కూడా దోచుకున్నాడు. ఆ తర్వాత అదే పని మళ్ళీ వీడియోలు బయటపెడతానని, లక్షల వసూలు ఇలా అగ్రవర్ణానికి చెందిన యువకుడికి బలైన వారు చాలామంది ఉన్నారు. బయటికి చెప్పుకోలేక అమ్మాయిలు ఇండ్లలో దాచి ఉంచిన సొమ్మును, అపహరించి తెచ్చి దుర్మార్గుడు చేతిలో పెడుతున్నారు. ఇలా చేయడాన్ని యువకుడు ఒక వ్యాపారంగా పెట్టుకున్నాడు. తాను సంపాదించిన పాపపు సొమ్ములు కుటుంబ సభ్యులకు వాటా ఇచ్చాడు. అందుకే వారు ఆ యువకుడు ఏం చేసినా పట్టించుకోవడం లేరు.

రూ.నాలుగు కోట్లు వసూలు చేసిన మోసగాడు :
మొత్తానికి పత్తికొండ యువకుడు పెట్టుబడి లేని వ్యాపారాన్ని వెతుక్కున్నాడు.కేవలం తన శరీర రంగు, అందాన్ని యువతులకు ఎరగా చూపి వారిని లక్షలకు లక్షలు లాగుతున్నాడు. ఇలా ఎంతోమందితో ప్రేమ వ్యవహారం నడిపి యువకుడు వారందరినీ మోసం చేసి నాలుగు కోట్ల దాకా మోసం చేసినట్లు చర్చ బాహాటంగా సాగుతోంది. ఇందులో కచ్చితంగా నిజం లేకపోలేదని జనం చర్చించుకుంటున్నారు. చదివిన చదువుతో ఉద్యోగాన్ని సంపాదించి ఉద్యోగం చేసే చోట కూడా అమ్మాయిలకు ఎరవేసి, మరికొందరికి ఉద్యోగం ఇప్పిస్తానని, ఆశ చూపి ఇలా ఏ రకంగా మోసం చేయాలో, అన్ని రకాలుగా మోసం చేసి కోట్లు గడించాడు. నేటికీ గతంలో ప్రేమించిన యువతికి పెళ్లి అయినా ఆమెను రకరకాలుగా బెదిరిస్తున్నాడు.ఆమె నుండి డబ్బులు వసూలు చేసిన విషయం బయట పెడితే వీడియోలు ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని, ఆమెను చీటికిమాటికి వేధింపులకు గురి చేస్తున్నాడు.

**దొంగ ప్రేమికుడి బాధితులు ఎందరో :**
పత్తికొండలో నివాసం ఉంటున్న దొంగ ప్రేమికుడు బాధితులు ఎందరో ఉన్నారు. వారెవ్వరూ బయటికి రాకపోవడం వల్ల దొంగ ప్రేమికుడు దర్జాగా తిరుగుతున్నాడు. వారందరినీ బ్లాక్ మెయిల్ చేస్తూ దొరికిన కాడికి దోచుకుంటున్నాడు. పైగా ఇతడికి కొంతమంది మద్దతు ఉన్నట్లు స్పష్టంగా అర్థం అవుతుంది. అందుకే ఇంత విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. ప్రేమ పేరుతో ఎరవేసి వారితో శారీరక సుఖం పొంది,వారి వీడియోలు, ఫోటోలు తీసి వారిని బ్లాక్ మెయిల్ చేయడమే ఇతడు వృత్తిగా పెట్టుకున్నాడు. ఇతని వల్ల ఎందరో ఇబ్బందుల పాలయ్యారు.వీరందరికీ ధైర్యం చేయలేక బజారున పడితే పరువు పోతుందన్న భయంతో, నోరు మెదపకున్నారు. లక్షల లక్షలు ఉత్తి పుణ్యానికి దొంగ ప్రేమికుడికి తగిలేస్తున్నారు. ఇందులో ఏ ఒక్కరు బయటికి వచ్చి ఫిర్యాదు చేస్తే దొంగ ప్రేమికుడికి దబిడి దిబిడి అయ్యే అవకాశం కచ్చితంగా ఉంది

**ఫిర్యాదు చేస్తే కేసు నమోదు :**
తానేదో రాజకీయ నాయకుడి కొడుకులని,తన తండ్రికి పలుకుబడి ఉందని తాము ధనవంతులమని, విర్రవీగుతూ అమ్మాయిలనుండి వసూలు చేసిన సొమ్ముతో విచ్చలవిడిగా జల్సాలు చేస్తూ,తిరిగే దొంగ ప్రేమికుడి గురించి ఒక్క బాధితురాలైన ఫిర్యాదు చేస్తే అతనిపై కేసు నమోదు చేయడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారు.ఇప్పటికే ఆయన గురించి పోలీసులు ఆరా తీస్తున్నట్లు పక్కా సమాచారం.ఇలాంటి సంఘవిద్రోహ శక్తి యువకుడ్ని కటకటాలు పాలు చేస్తే నయవంచక ప్రేమికులకు ఫుల్ స్టాప్ పడే అవకాశం ఉంది. ఇందుకు ఏ బాధితురాలు తొలి అడుగు వేసి ముందుకు వస్తుందో? వేచి చూడాలి లేకపోతే ఇలాంటివారు ఇంకెంతమంది అమ్మాయిల జీవితాలతో ఆటాడుకుంటారో తెలియదు.

**ప్రేమ పేరుతో వంచించి వసూళ్లు :**
ప్రేమ కోసం ప్రాణాలు వదిలి వారు ఉన్నారు. పెద్దలను ఎదిరించిన వారు ఉన్నారు.నేటికీ అందరికీ దూరంగా జీవించేవారు ఉన్నారు. కానీ ప్రేమ పేరుతో అమ్మాయిలను వంచించి వసూలు చేసే మొనగాడు,మగాడు ఒకే ఒక్కడు పత్తికొండలో ఉన్నాడు.ఆయనకు పని పాట అంటూ ఏమీ లేదు.ఇలా వంచించడమే పనిగా పెట్టుకున్నాడు.ఆపై వసూళ్లు చేస్తూ సంపాదించుకుంటున్నాడు.ఇలాంటివారు సమాజానికి ఎంత ప్రమాదకరమో? ఊహించుకుంటేనే భయం వేస్తుంది.ఇలాంటి వారిని గురించి ప్రజలకు తెలియకపోవడం వల్లనే వీడి ఆటలు కొనసాగుతూనే ఉన్నాయి.ఒకప్పుడు సాధారణ జీవితం గడిపిన యువకుని కుటుంబం, ఉన్నట్టుండి కోట్లకు పరిగెత్తడం పత్తికొండ వాసులనే ఆశ్చర్యాన్ని గురిచేస్తుంది.దీని వెనక యువకుడు ప్రేమ వ్యవహారం అక్రమ వసూల దందా దాగి ఉందన్న విషయం జనానికి తెలియదు. ఇప్పటికైనా ఇలాంటి వారిపై బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే ఇంకొందరు బలికాకుండా ఉంటారని ప్రజలు కోరుకుంటున్నారు...

## జమ్మూ కాశ్మీర్ దాడి మృతులకు జనసేన కన్నీటి నివాళి



**శంఖవరం, ఏప్రిల్ 24 (జనస్వరం) :** జమ్మూ కాశ్మీర్‌లోని బైసరన్ ప్రాంతంలో పర్యటిస్తున్న పర్యాటకులపై పాశవిక దాడిలో మృతి చెందిన 28 మంది పర్యాటకులకు శంఖవరం మండలంలోని కత్తిపూడిలో జనసేన పార్టీ కన్నీటి నివాళి అర్పించింది. కత్తిపూడిలో ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్య కిరణ్ (బాబి) ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప దీక్షలో కాకినాడ అర్బన్ డవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ తుమ్మల బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీతో సహా పలువురు నేతలు హాజరై, 28 మంది మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సంధర్భంగా బాబి మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన నేతలు, జనసైనికులు అందరూ పాల్గొని మృతుల కుటుంబాలకు నివాళి అర్పించడం జరిగిందన్నారు. జమ్మూ కాశ్మీర్ దాడి అనాగరిక, దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఈ ఉగ్రదాడిని ప్రపంచ దేశాల నేతలు తీవ్రంగా ఖండించారన్నారు. ఎందరో అమాయకులు బలైన ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నేతలు జమ్మూ కాశ్మీర్ ఘటనను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో జిల్లా టెలికమ్ అడ్వైజరీ కమిటి సభ్యుడు మేకల కృష్ణ, జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యుడు కరణం సుబ్రహ్మణ్యం, శంఖవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు గాబు సుభాష్, ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి, ఏలేశ్వరం పార్టీ మండల అధ్యక్షుడు పెంటకోట మోహన్, ఎంపీటీసీ గాది రాజబాబు, జనసేన నేతలు యర్రంశెట్టి బాబ్జి, గౌతు లక్ష్మి, ఎస్ జయబాబు, బంక కోదండ రాంబాబు, పిల్లా పద్మరాజు, పోసిన శ్రీను, డాక్టర్ సత్తి వీర్రాజు, పలువురు ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన నేతలు, జనసైనికులు పాల్గొన్నారు.

## పహాల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా మదనపల్లెలో జనసేన కోవ్వొత్తుల ర్యాలీ



**మదనపల్లె, ఏప్రిల్ 24 (జనస్వరం) :** జమ్మూ కాశ్మీర్‌లోని పహాల్గామ్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడిలో అమాయక భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, మదనపల్లెలో జనసేన నాయకురాలు దారం అనిత నేతృత్వంలో గురువారం సాయంత్రం 6 గంటలకు శాంతియుత కోవ్వొత్తుల నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అప్పారావు వీధి సర్కిల్ నుండి బెంగుళూరు బస్టాండ్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం కూడలి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ, పాల్గొన్న ప్రతి ఒక్కరూ దేశభక్తి తో కూడిన గంభీరమైన వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్ మరియు రాష్ట్ర బీసీ కార్యదర్శి మల్లికా వాణి, దేవి వరలక్ష్మి, లక్ష్మీదేవి, సునీత, ఆదిలక్ష్మి, నందిని, రమ వంటి జనసేన మహిళా నాయకులు, అలాగే అశ్వత్, కుప్పాల శంకర్, శ్రీనాథ్, ఆదినారాయణ, సుబ్బరాజు, మనీ, ప్రసాద్ పూల, రవి, శేఖర, గంగరాజు సుధాకర్, గంగరాజు శ్రీరాములు, గురికాని శ్రీధర్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఇక రామసముద్రం నుండి జనసేన నాయకులు జనార్ధన, పి.మంజునాథ, సురేష్ పి, సి.మంజునాథ్, హరినాథ్ రెడ్డి, రెడ్డప్ప, శంకరప్ప లు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పార్టీ కార్యకర్తలు, వీర మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని ఉగ్రవాద చర్యలను ఖండించారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో పహల్గాం ఉగ్రదాడిపై నిరసన

**విజయవాడలో కొవ్వొత్తుల ర్యాలీ**



**విజయవాడ, ఏప్రిల్ 24 (జనస్వరం) :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడిలో 28 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో, జనసేన పార్టీ మూడు రోజులు పాటు సంతాప దినాలుగా ప్రకటించింది. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, ఈ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం చిట్టీనగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన కొవ్వొత్తుల ర్యాలీ, శ్రీనివాస్ మహల్ సెంటర్ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకూ శాంతియుతంగా సాగింది. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, తూర్పు నియోజకవర్గ ఇంచార్జి, విజయవాడ పార్లమెంట్ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు సూచనలతో, కృష్ణ, పెన్నా రీజనల్ మహిళా కోఆర్డినేటర్ మల్లెపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమ్మిశెట్టి వాసు హాజరయ్యారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ, అమాయకులపై జరిగిన దాడి పిరికితనానికి చిహ్నమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నిరసన కార్యక్రమంలో జనసేన పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లింగం శివ ప్రసాద్, ఎంఆర్‌కే, నల్లబెల్లి కనక, శనివారపు శివ, రెడ్డిపల్లి గంగాధర్, రెడ్డిపల్లి అనిత, బొమ్ము గోవింద్ లక్ష్మి, ఏలూరు శరత్, బాధర్ల శివ, సోంపక చిన్నబాబు, పల్లాంటి అది, మలపరెడ్డి అప్పారావు, బగ్గం దుర్గాప్రసాద్, బోలేపల్లి కోటి, నారంశెట్టి కూర్మారావు, ఆకుల రవిశంకర్, భావిశెట్టి శ్రీనివాస్, బత్తుల వెంకటేష్, పోలిశెట్టి శివ, వేవినా నాగరాజు తదితరులు ఉన్నారు. డివిజన్ సమన్వయకర్తలు, జనసేన పార్టీ దార్మిక మండలి సభ్యులు, నాయకులు కార్యకర్తలంతా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ఉగ్రవాదాన్ని ఖండించారు.

## ప్రతిభకు పురస్కారాలు



**తిరుపతి, ఏప్రిల్ 24 (జనస్వరం) :** విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన అధికారులు, ఉద్యో గులకు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉత్తమ పురస్కారాలు అందజేశారు. గురువారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో పన్ను వసూళ్లలో ప్రతిభ కనబరచిన జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి సుశీలాదేవి.. పల్లెపండుగ అమలులో ప్రతిభ కనబరచిన డీపీఆర్‌ఈవో (పంచాయతీరాజ్ ఎస్‌ఈ) రామ్మోహన్.. ఉపాధి హామీ పథకంలో ఉత్తమ సేవలు అందించిన ఫీల్డ్ అసిస్టెంట్ బాలరాజు పురస్కారాలు అందుకున్నారు. వీరిని కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు.